మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక
www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శుక్రవారం FRIDAY 14-8-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 46 Issue: 46

Published from Jagitial
Circulated to Telangana

శ్రీ పరాభవ నామ సంవత్సరం, దక్షిణాయనం - వర్ష ఋతువు, శ్రావణ మాసం - శుక్లపక్షం, సూర్యోదయం - ఉ. 6:02, సూర్యాస్తమయం - సా. 6:39, తిథి, విదియ సా. 6:52 వరకు, తరువాత తదియ, సంస్కృత వారం, భృగు వాసరః నక్షత్రం. పూర్వ ఫల్గుని(పుబ్బ) తె. 3:40ం వరకు. తరువాత ఉత్తర ఫల్గుని(ఉత్తర). యోగం. పరిఘ ఉ. 9:24 వరకు. కరణం. బాలవ ఉ. 7:41 వరకు. కౌలవ సా. 6:52 వరకు. వర్జ్యం. మ. 12:19 నుండి మ. 1:51 వరకు. దుర్ముహూర్తం. ఉ. 8:34 నుండి ఉ. 9:24 వరకు. మ. 12:46 నుండి మ. 1:36 వరకు. రాహుకాలం. ఉ. 10:46 నుండి మ. 12:20 వరకు. యమగండం. మ. 3:29 నుండి సా. 5:04 వరకు. గుళికాకాలం. ఉ. 7:37 నుండి ఉ. 9:11 వరకు. బ్రహ్మముహూర్తం. తె. 4:26 నుండి తె. 5:14 వరకు. అమృత ఘడియలు. రా. 9:56 నుండి రా. 11:28 వరకు. అభిజిత్ ముహూర్తం. ఉ. 11:55 నుండి మ. 12:46 వరకు. గమనిక: "ం" అనగా మరుసటి రోజున

'కూకట్‌పల్లిలో వందల కోట్ల విలువ చేసే 11 ఎకరాల భూమిలో మంచి సంకల్పంతో ఇందిరమ్మ టవర్స్ నిర్మించే అద్భుతమైన కార్యక్రమం చేపట్టాం.నగరంలో నిరుపేదలు ఎవరు ఎక్కడ నివసిస్తున్నారో వారికి అక్కడే ఇండ్లు ఇవ్వాలని సంకల్పించాం'అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

ఈ సందర్భంగా పేదల కోసం నిర్మించే ఇండ్లకయ్యే రిజిస్ట్రేషన్ చార్జీలను కూడా రద్దు చేయాలని సీఎం ఆదేశించారు. 'నిరుపేదలు ఉండడానికి సొంత ఇళ్లు ఇవ్వాలన్న ఆలోచనతో ముందుకు వెళుతున్నాం. సొంతింటి కల నెరవేరడానికి నూటికి నూరు శాతం అండగా నిలబడుతాం.



# నేనే.. అంతా నేనే!

## నేను రూ.12 వేల కోట్లిస్తేనే మహిళలకు ఫ్రీ బస్సు

టెన్త్ కూడా చదవని సిరాజ్‌ను డీఎస్పీ చేశా

కరువు రావాల్నని కొందరు క్షుద్రపూజలు చేసిండ్రు

తెలంగాణ బాగు కోసం 18 గంటలు కష్టపడుతున్న

'22-ఏ' భూములపై ఆందోళన అవసరం లేదు

ఇందిరమ్మ టవర్స్ శంకుస్థాపనలో సీఎం రేవంత్



హైదరాబాద్, ఆగస్టు 13 (ఈవార్తలు): మొదటి విడతగా కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, మేడ్చల్, కంటోన్మెంట్, ఎల్బీనగర్, ఉప్పల్ లాంటి అత్యధికంగా పేదలు ఉండే ప్రాంతాలు, ఇతర జిల్లాలు, ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాల నుండి పనులు చేయడానికి ఇక్కడికి వలసలు వచ్చిన ప్రాంతాల్లో ఉండటానికి మంచి ఇల్లు ఇవ్వడానికి ఈ ప్రభుత్వం కృషి చేస్తోంది' అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.కోర్ అర్బన్ క్యూర్ ప్రాంత పరిధిలో హైదరాబాద్ కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ కాలనీలో ఇందిరమ్మ ఇండ్లు (టవర్స్) నిర్మాణానికి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దిద్దళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ ఇతర ఎమ్మెల్యేలు అధికారులు ఉన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. గతంలో ఏదైనా పని చేయాలంటే గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ, కార్పొరేషన్.. ఇలా తిరగడానికే సమయం సరిపోయేది. అందుకే ప్రజల సౌలభ్యం కోసం సైబరాబాద్ కమిషనరేట్‌ను ఏర్పాటు చేశాం అని చెప్పారు. 'మీ అభివృద్ధి కోసం నిలబడుతా. పది మందికి మేలు చేయాలన్న ఆలోచన నాకుంది. మంచి చేయడానికి చిత్తశుద్ధి కావాలి. మంచి ఆలోచన కావాలి. విధ్వంసమైన తెలంగాణను వికాసం వైపు

- తరువాయి 2 వ పేజీలో...

# 'నల్సార్' పిలగాండ్లను నలిపేద్దామనుకున్నరు!


## వర్సిటీ లా స్టూడెంట్స్‌పై బీసీఐ నిషేధం

ఏ విద్యార్థికీ సభ్యత్వం ఇవ్వొద్దని ఆదేశాలు

వివాదం.. కాసేపటికే ఉత్తర్వులపై యూటర్న్


లేఖ రాసిన విద్యార్థుల వివరాలివ్వాలని వర్సిటీకి ఆదేశాలు

హైదరాబాద్‌లోని నల్సార్ లా యూనివర్సిటీ 2026 బ్యాచ్ విద్యార్థులను అడ్వొకేట్లుగా నమోదు చేసుకోవద్దని నిషేధం విధిస్తూ జారీ చేసిన ఉత్తర్వును బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వెనక్కి తీసుకుంది.




న్యూఢిల్లీ: తమ స్నాతకోత్సవానికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్య కాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించడాన్ని నిరసిస్తూ హైదరాబాద్‌లోని 'నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా' విద్యార్థులు ఆందోళన చేపట్టడం తీవ్ర కలకలం రేపింది. ఈ పరిణామంపై తీవ్రంగా స్పందించిన బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా.. నల్సార్ లా విద్యార్థులపై తాత్కాలిక నిషేధం విధించింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు 2026లో నల్సార్ నుంచి ఉత్తీర్ణులయ్యే ఏ విద్యార్థిని కూడా అడ్వకేట్‌గా నమోదు చేసుకోవద్దని అన్ని రాష్ట్రాల

- తరువాయి 2 వ పేజీలో...




# రేవంత్, ఉత్తమ్ బొమ్మలు 'స్మార్ట్'

కొత్త డిజైన్‌తో రేషన్ కార్డుల రూపకల్పన.. నమూనాను విడుదల చేసిన ప్రభుత్వం

కార్డుల్లో భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం.. నకిలీ అడ్డుకట్టకు హోలోగ్రామ్, క్యూర్ కోడ్

హైదరాబాద్, ఆగస్టు 13 (ఈవార్తలు): తెలంగాణలో అర్హులైన పేద కుటుంబాలకు కొత్త రూపంలో స్మార్ట్ రేషన్ కార్డులు అందుబాటులోకి రానున్నాయి.ఆహార భద్రత కార్డుల పంపిణీని మరింత ఆధునికంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త డిజైన్‌తో స్మార్ట్ రేషన్ కార్డులను రూపొందించింది. ఈ కార్డుల నమూనాను ప్రభుత్వం విడుదల చేయడంతో వాటిలో ఉండే ప్రత్యేకతలపై ఆసక్తి నెలకొంది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్ట్ 15వ తేదీన సంగారెడ్డిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని అధికారికంగా ప్రారంభించనున్నారు. ఈ కొత్త

- తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు



బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,360 |
| వెండి (కిలో): | రూ.2,60,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,313 |

## విశ్వవాణి



బంగారు గొలుసు, ఉంగరం, చెవిపోగులు వంటి లోహపు నగలు ధరించినవాళ్లపై పిడుగు ఆకర్షిస్తుందనేది అపోహేనని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. చిన్నపాటి లోహ వస్తువులు పిడుగును తమవైపు ఆకర్షించవని అంటున్నారు. పిడుగు భూమిని చేరేందుకు విద్యుత్ సులభంగా ప్రవహించే మార్గాన్ని అనుసరిస్తుంది. అందువల్ల బహిరంగ ప్రదేశంలో ఒంటరిగా నిలబడటం, చుట్టుపక్కల ఉన్న వాటికంటే ఎత్తుగా ఉండటం, వర్షం-ఉరుముల సమయంలో బయటే ఉండటం వంటి అంశాలు పిడుగుపాటు ప్రమాదాన్ని పెంచుతాయని, నగలు ధరించారా లేదా అన్నది ప్రధాన అంశం కాదని పేర్కొంటున్నారు.

BSNL

# రూ.1కే సిమ్, ఫ్రీ కాల్స్

బీఎస్ఎన్ఎల్ బంపరాఫర్

పంద్రాగస్టు వేళ ప్రత్యేక ఆఫర్లు

సెప్టెంబర్ 12 వరకు అందుబాటు

న్యూఢిల్లీ: 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ రంగ టెలికం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) వినియోగదారుల కోసం ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. కొత్త కస్టమర్ల

- తరువాయి 3 వ పేజీలో...

# కార్పొరేట్‌కు సాగిల పడ్తరా?

ప్యాక్‌డ్ పదార్థాలపై లేబులింగ్ కచ్చితం.. ఎదుగుతున్న పిల్లల ఆరోగ్యం ముఖ్యం

మీరు చేయలేకపోతే మేమే చేస్తాం.. కేంద్రానికి సుప్రీం కోర్టు అల్టిమేటం




న్యూఢిల్లీ: ఆహార పదార్థాల లేబులింగ్ విషయంలో కేంద్రానికి సర్వోన్నత న్యాయస్థానం అల్టిమేటం ఇచ్చింది. అధిక మొత్తంలో చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వులు కలిగిన ప్యాక్ చేసిన ఆహార పదార్థాలపై హెచ్చరిక లేబుళ్లను 'మీరు చేయలేకపోతే.. మేము చేస్తామని' సుప్రీంకోర్టు గురువారం కేంద్ర ప్రభుత్వానికి తీవ్ర హెచ్చరిక జారీ చేసింది. ఈ విషయంలో కేంద్రం, భారత ఆహార భద్రత ప్రమాణాల ప్రాధికార సంస్థ వ్యవహరిస్తున్న తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అధికారులు ఏమైనా కార్పొరేట్ సంస్థల ఒత్తిడికి లొంగిపోతున్నారా? అని నిలదీసింది. 'ఈ అంశం పౌరులు ముఖ్యంగా ఎదుగుతున్న పిల్లల ఆరోగ్యానికి సంబంధించింది. దీనిపై తీసుకునే నిర్ణయాలు కార్పొరేట్ ఒత్తిళ్లకు ప్రభావితం కాకూడదు' అని జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ఆహార పదార్థాల లేబులింగ్ విషయంలో దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై

- తరువాయి 2 వ పేజీలో...

# గేట్ 2027 షెడ్యూల్ రిలీజ్

నేటి నుంచి దరఖాస్తులు ప్రారంభం



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఉన్నత విద్యా సంస్థల్లో ఎంటెక్, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలతో పాటు పబ్లిక్ సెక్టార్ సంస్థల్లో ఉద్యోగాలకు అర్హత సాధించేందుకు నిర్వహించే గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్ (గేట్) పరీక్షకు సంబంధించిన

- తరువాయి 2 వ పేజీలో...

# నీట్-యూజీ కౌన్సెలింగ్ షెడ్యూల్ మార్పు

కొత్త తేదీలను విడుదల చేసిన ఎంసీసీ



న్యూఢిల్లీ: నీట్ (యూజీ) అభ్యర్థులకు మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ కీలక ప్రకటన చేసింది. ఫస్ట్ ఫేజ్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను సవరిస్తున్నట్లుగా ప్రకటించింది. దేశవ్యాప్తంగా ఆలిండియా కోటా

- తరువాయి 2 వ పేజీలో...



# ఫ్రీ కుట్టుమిషన్ల దరఖాస్తు రేపటి నుంచే

రాష్ట్రంలోని మహిళలకు ఉచితంగా ఆటోమేటిక్ కుట్టుమిషన్లు

హైదరాబాద్, ఆగస్టు 13 (ఈవార్తలు): తెలంగాణలోని బీసీ మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం కీలక శుభవార్త అందించింది. మహిళలు ఇంటి నుంచే ఉపాధి పొందుతూ ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ఉచిత ఆటోమేటిక్ కుట్టుమిషన్లను అందించేందుకు ప్రభుత్వం కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు పేరుతో చేపట్టిన ఈ పథకాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ సచివాలయంలో లాంఛనంగా ప్రారంభించారు. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 1.19 లక్షల మంది బీసీ

- తరువాయి 3 వ పేజీలో...

# ఈ పాలన చూస్తుంటే బాధైతుంది!

కాంగ్రెస్ కానోళ్లు పెద్ద పోస్టుల్లో ఉన్నరు

అభివృద్ధి పేరుతో నిధుల దుర్వినియోగం

మరోసారి రాజగోపాల్ రెడ్డి నిరసనగళం



హైదరాబాద్, ఆగస్టు 13 (ఈవార్తలు): తెలంగాణ రాజకీయాల్లో మార్పు అవసరమని.. నిజాయితీ కలిగి, అంకితభావంతో పనిచేసే నాయకులు తన వెంట ఉంటే తమిళనాడు తరహాలో తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో మార్పు తీసుకురాగలమని మునుగోడు ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో కళాకారుడు

- తరువాయి 2 వ పేజీలో...

# అంబులెన్స్ లేటైతే 10 వేల జరిమానా

ప్రమాద సమాచారం అందిన 10 నిమిషాల్లో స్పాట్‌లో ఉండాలి

ఎన్‌హెచ్‌ఏఐ కీలక ఆదేశాలు జారీ

జాతీయ రహదారులపై ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులకు అత్యవసర వైద్య సేవలు అందించడంలో నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది.


› 2

## రాశి ఫలాలు

14-8-2026

**మేషం:** వ్యాపార, ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితులుంటాయి. చిన్ననాటి మిత్రులతో కలహ సూచనలున్నవి. అనారోగ్య సమస్యలు కొంత ఇబ్బంది కలిగిస్తాయి. సంతాన విద్యా ఫలితాలు నిరుత్సాహ పరుస్తాయి. దైవ అనుగ్రహంతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. దూరప్రయాణ సూచనలున్నవి.

**వృషభం:** చేపట్టిన పనులు వాయిదా వేస్తారు. ప్రయాణాలలో అప్రమత్తంగా వ్యవహరించాలి. ఋణదాతల నుండి ఒత్తిడి పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలు నత్తనడకన సాగుతాయి. ఉద్యోగులకు అధికారులతో నూతన సమస్యలు కలుగుతాయి. ఆర్థిక వాతావరణం నిరుత్సాహంగా ఉంటుంది.

**మిధునం:** సమాజంలో ప్రముఖుల పరిచయాలు పెరుగుతాయి. మిత్రుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. కుటుంబ సభ్యులతో దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆర్థిక అనుకూలత కలుగుతుంది. కుటుంబ వ్యవహారాలలో ముఖ్య నిర్ణయాలు అమలు పరుస్తారు. వ్యాపారాలు, ఉద్యోగాలు సంతృప్తికరంగా సాగుతాయి.

**కర్కాటకం:** చిన్ననాటి మిత్రులతో విందు వినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు. విలువైన వస్తులాభాలు పొందుతారు. చేపట్టిన పనులలో యత్నకార్యసిద్ధి కలుగుతుంది. ప్రముఖులతో పరిచయాలు లాభిస్తాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. వ్యాపార, ఉద్యోగాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి.

**సింహం:** ముఖ్యమైన పనులు మధ్యలో నిలిచిపోతాయి. వృత్తి వ్యాపారాలలో శ్రమకు తగిన ఫలితం ఉండదు. సన్నిహితులతో మాటపట్టింపులుంటాయి. మిత్రుల నుండి అవసరానికి ధన సహాయం అందుతుంది. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. ఉద్యోగమున అదనపు బాధ్యతలు చికాకు పరుస్తాయి.

**కన్య:** చేపట్టిన పనులు నిదానంగా సాగుతాయి. వృధా ఖర్చులు పెరుగుతాయి. ఇంటా బయట పని ఒత్తిడి వలన తగిన విశ్రాంతి ఉండదు. కుటుంబ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపార విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి.

**తుల:** బంధు మిత్రులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. సంతానం పోటీపరీక్షల్లో విజయం సాధిస్తారు. ఆప్తుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుకుంటారు. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. స్థిరాస్తి వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. వ్యాపారమున కీలక నిర్ణయాలు అమలు పరుస్తారు. ఉద్యోగ వాతావరణం అనుకూలిస్తుంది.

**వృశ్చికం:** కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు కలుగుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ముఖ్యమైన పనులు వాయిదా పడతాయి. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వృత్తి వ్యాపారాలు నత్తనడకగా సాగుతాయి. ఉద్యోగులు అదనపు బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారు.

**ధనస్సు:** నిరుద్యోగులు నూతన ఉద్యోగ అవకాశాలు పొందుతారు. కుటుంబ పెద్దల ఆదరణ పెరుగుతుంది. బంధు మిత్రులతో విందు వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. నూతన వ్యాపార విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. అవసరానికి చేతిలో డబ్బు నిలువక నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు.

**మకరం:** ముఖ్యమైన పనులు మందకొడిగా సాగుతాయి. వృత్తి వ్యాపారాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది. ఇంటా బయట ఒత్తిడి వలన మానసిక సమస్యలు కలుగుతాయి. దూరప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగాలలో చిన్నపాటి వివాదాలు తప్పవు.

**కుంభం:** దూరపు బంధువుల నుండి శుభవార్తలు అందుతాయి. ఆర్థిక పరంగా అనుకూలత సాధిస్తారు. నూతన వస్తు, వస్త్రలాభాలు పొందుతారు. చిన్ననాటి స్నేహితులతో దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు సజావుగా సాగుతాయి. ఉద్యోగమున జీత భత్యాల విషయంలో శుభఫలితాలు పొందుతారు.

**మీనం:** చిన్ననాటి మిత్రులతో గృహమున విందు వినోద కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉద్యోగమున మీ పని తీరుకు అధికారుల నుండి గుర్తింపు లభిస్తుంది. చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. వ్యాపారాలు ఆశించిన విధంగా రాణిస్తాయి. ఆదాయ మార్గాలు పెరుగుతాయి. వ్యాపారాలలో నూతనోత్సాహంతో ముందుకు సాగుతారు.

# నేనే.. అంతా నేనే!

(మొదటి పేజీ తరువాయి)

నడిపించడానికి రోజుకు 18 గంటలు పనిచేయడానికి దేవుడు శక్తినిచ్చారు. అందుకు ప్రజలు.. మీరూ ఆశీర్వదించండి'అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. మరోవైపు నిషేధిత జాబితాల్లో ఉన్న భూములకు సంబంధించి హక్కుదారులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. నిషేధిత జాబితా (22 ఏ) చేరిన భూముల సర్వే నంబర్లకు బై-నంబర్లు ఇచ్చి హక్కుదారుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నిషేధిత జాబితాలో పెట్టిన భూముల సమస్యను ప్రస్తావించారు. 'ఏదైనా కారణంగా మీ భూమి 22-ఏలో చేరి ఉంటే, కొనుగోలు చేసిన హక్కుదారుల స్థలాలు ఎక్కడికీ పోవు. నేను హామీ ఇస్తున్నా. కోర్టు కేసుల్లో ఉన్న భూములకు సంబంధించి సర్వే నంబర్‌లో వచ్చిన మొత్తం భూములను నిషేధిత జాబితాలో చేర్చారు. కోర్టు కేసులున్న స్థలాల వరకు పక్కనపెట్టి మిగతా వాటికి బైనెంబర్లు ఇచ్చి పరిష్కరిస్తున్నారు. ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు'అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 'కూకట్‌పల్లి ప్రాంత ప్రజలకు ఏం కావాలన్నా పనులు చేయించుకోండి. ఈ ప్రాంత ప్రజల రుణం తీర్చుకునే అవకాశం వచ్చింది. ఈ ప్రాంతంలో రోడ్లు, ఫ్లైఓవర్లు, చెరువుల పునరుద్ధరణ, విద్య కోసం పాఠశాలలు, కాలేజీలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం అవసరమున్న పరిశ్రమల విషయంలోనైనా నియోజకవర్గాన్ని ప్రత్యేకంగా చూడాలి'అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేదికపైనున్న మంత్రి శ్రీధర్ బాబుకి సూచించారు. 'అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు విషయంలో ప్రజలు కూడా గత పాలనను, ఈ రెండేళ్ల పాలనను బేరీజు వేసుకోవాలి. గత ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను వేటినీ నిలిపివేయలేదు. అదనంగా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాం' అని సంక్షేమ పథకాలను సీఎం రేవంత్ రెడ్డి వివరించారు.

### కోటి మంది మహిళలకు కోటి చీరలు

'రాష్ట్రంలో 3.28 కోట్ల మంది ప్రజలకు ప్రతి వ్యక్తికి ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున సన్నబియ్యం అందిస్తున్నాం. 200 యూనిట్లు ఉచిత కరెంట్ ఇస్తున్నాం. రూ. 500 లకే సిలిండర్ అందజేస్తున్నాం. కోటి మంది మహిళలకు కోటి ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశాం'అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 'ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించడం వల్ల ఉద్యోగ, ఉపాధి కోసం చదువుల కోసం వెళ్లేవారు నెలకు ఆరేడు వేలు ఆదా చేసుకుంటున్నారు. ఇప్పటికే ఆర్టీసీకి 12 వేల కోట్లు చెల్లించాం. స్వయం సహాయక సంఘాలు 65 వేల కోట్ల బ్యాంకు లింకేజీ ఇచ్చి రూ. 2500 కోట్ల వడ్డీ చెల్లించాం'అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. 'మహిళా సంఘాల పేరిట వెయ్యి బస్సులు కొనిచ్చి ఆర్టీసీకి అద్దెకిప్పించాం. వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లు ఏర్పాటుకు అవకాశం కల్పించాం. ఆదిలాబాద్ అడవుల నుంచి అచ్చంపేట వరకు ఆడబిడ్డలు తయారు చేసిన వస్తువులను విక్రయించుకోవడానికి శిల్పారామంలో మూడున్నర ఎకరాల్లో ఇందిరా మహిళా బజార్ల ఏర్పాటుకు విలువైన స్థలమిచ్చాం'అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. 'రెండేండ్లు తిరిగేలోపు ప్రభుత్వానికి సంబంధించి అన్ని శాఖల్లో రెండేళ్లు తిరిగేలోపు 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. కూకట్‌పల్లిలో వందల కోట్ల విలువ చేసే 11 ఎకరాల భూమిలో మంచి సంకల్పంతో ఇందిరమ్మ టవర్స్ నిర్మించే అద్భుతమైన కార్యక్రమం చేపట్టాం. నగరంలో నిరుపేదలు ఎవరు ఎక్కడ నివసిస్తున్నారో వారికి అక్కడే ఇండ్లు ఇవ్వాలని సంకల్పించాం'అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 'పేదల కోసం నిర్మించే ఇండ్లకయ్యే రిజిస్ట్రేషన్ చార్జీలను కూడా రద్దు చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు మంత్రులకు సూచించారు. ఇప్పుడు నిర్మించే ఇళ్లకు సంబంధించి నిరుపేదలకు స్థలం మొత్తం ఉచితంగా అందిస్తున్నాం. నిర్మాణానికి అయ్యే వ్యయంలో ఐదారు లక్షలు లబ్ధిదారులు భరిస్తే నిర్మాణం జరుగుతున్నప్పుడు ఎలా సాగుతుందో ఎప్పుడైనా పరిశీలించే హక్కుదారులవుతారు'అని సీఎం పేర్కొన్నారు.

# రేవంత్, ఉత్తమ్ బొమ్మలు 'స్మార్ట్'

(మొదటి పేజీ తరువాయి)

స్మార్ట్ రేషన్ కార్డు ముందు భాగంలో సీఎం రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటోలు ముద్రించారు. దీంతో పాటు రేషన్ కార్డు నంబర్, కుటుంబ యజమాని పేరు, సంబంధిత రేషన్ షాపు నంబర్ వంటి వివరాలను ముద్రించనున్నారు. లబ్ధిదారులను సులభంగా గుర్తించేందుకు అవసరమైన సమాచారం కూడా ఆ కార్డులో పొందుపరుస్తారు. ఈ స్మార్ట్ రేషన్ కార్డులో భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చినట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. కార్డును దుర్వినియోగం చేయడం, నకిలీ తయారీకి అడ్డుకట్ట వేసేలా ప్రభుత్వ హోలోగ్రామ్, ఎంబోస్డ్ టెక్స్ట్, మైక్రో టెక్స్ట్, వాటర్‌మార్క్, ఇన్విజిబుల్ యూవీ లోగో, గిల్లోషే ప్యాటర్న్స్ వంటి పలు భద్రతా అంశాలను పొందుపరిచారు. అదే సమయంలో కార్డులోని కీలక డిజిటల్ ఫీచర్‌గా ఎన్‌క్రిప్టెడ్ క్యూఆర్ కోడ్ ఉండనుంది. లబ్ధిదారుడి గుర్తింపు, వివరాలను తక్షణమే ధ్రువీకరణ చేసుకునేందుకు ఈ క్యూఆర్ ఉపయోగపడనుంది. కార్డులోని డేటాను తారుమారు చేయకుండా ఉండేలా ఈ విధానాన్ని రూపొందించినట్లు ప్రభుత్వం తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం సుమారు 1,06,28,092 ఆహార భద్రత కార్డులు ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. వీటి పరిధిలో దాదాపు 3.43 కోట్ల మంది లబ్ధిదారులు ఉన్నారు. అర్హత కలిగిన కుటుంబాలకు ప్రతి నెలా 6 కిలోల నాణ్యమైన సన్నబియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ తెలిపింది. ఆగస్టు 15వ తేదీన సంగారెడ్డిలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ స్మార్ట్ రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభించనున్నారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలోని మిగిలిన 33 జిల్లాల కేంద్రాల్లోనూ ఏకకాలంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ వర్గాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా కార్డులు అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. స్మార్ట్ కార్డుల పంపిణీలో లబ్ధిదారుల గుర్తింపును పక్కాగా ధ్రువీకరించేందుకు చౌక ధరల దుకాణాలు, సంబంధిత శాఖల ద్వారా పంపిణీ చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనివల్ల పారదర్శకత పెరగడంతో పాటు పంపిణీలో వివాదాలకు అవకాశం తగ్గుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కార్డుల పంపిణీ జరిగేలా జిల్లా యంత్రాంగం, పౌరసరఫరాల శాఖ అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. మొత్తంగా కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల్లో డిజిటల్ ధ్రువీకరణతో పాటు సెక్యూరిటీ ఫీచర్లు ఉండటం ఈ కార్డుల ప్రత్యేకతగా నిలవనుంది.

# 'నల్సార్' పిలగాండ్లను నలిపేద్దామనుకున్నరు!

(మొదటి పేజీ తరువాయి)

బార్ కౌన్సిళ్లను ఆదేశించింది. నల్సార్ నుంచి 2026లో లా డిగ్రీ పొందిన ఏ విద్యార్థినీ లాయర్‌గా నమోదు చేయకూడదని బీసీఐ ఛైర్మన్ మనన్ కుమార్ మిశ్రా స్పష్టం చేశారు. అయితే, కొద్ది గంటల్లోనే ఈ ఉత్తర్వులను బీసీఐ ఉప-సంహరించుకోవడం గమనార్హం. వివరాల్లోకెళితే.. నల్సార్ స్నాతకోత్సవానికి సీజేఐ జస్టిస్ సూర్య కాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించాలనే విశ్వవిద్యాలయ ప్రతిపాదనను కొంతమంది విద్యార్థులు వ్యతిరేకిస్తూ ఉద్యమం ప్రారంభించారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళనలు చేస్తోన్న విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జ్‌కు సంబంధించిన సుప్రీంకోర్టు విచారణలో ప్రధాన న్యాయమూర్తి చేసిన కొన్ని వ్యాఖ్యలే విద్యార్థుల నిరసనకు ప్రధాన కారణం. ఈ నిరసన ప్రచారాన్ని ఎవరు ప్రారంభించారు? ఎవరు సమన్వయం చేశారు? అనే దానిపై సమగ్ర అందజేయాలని బీసీఐ కోరింది. ఇందుకోసం మూడు రోజుల గడువు ఇచ్చింది. 'అత్యున్నత న్యాయ స్థానం పట్ల ఎలాంటి గౌరవం లేనివారు బాధ్యతాయుతమైన లేదా భావవ్యక్తీకరణ కలిగిన లాయర్‌గా లేదా న్యాయమూర్తిగా రాణించలేరు. అలాంటి వారు న్యాయవాద వృత్తికి భారంగానే ఉంటారు. ఇలాంటి ప్రవర్తన ఈ వృత్తి క్రమశిక్షణ, నైతిక ప్రమాణాలకు విరుద్ధం.. మా అనుభవంలో ఇలాంటి వారు నిత్యం ధర్నాలు, బహిష్కరణలకు పాల్పడుతూ న్యాయవాద వృత్తికి కలంకం తెస్తారు' అని బీసీఐ ప్రకటనలో పేర్కొంది. బీజేపీ రాజ్యసభ ఎంపీ అయిన బీసీఐ చైర్మన్.. యూనివర్సిటీలోని కొందరు ప్రొఫెసర్లు గ్రూపులుగా ఏర్పడి విద్యార్థులను దారి తప్పిస్తూ, రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. ఇది చాలా తీవ్రమైన అంశమని వ్యాఖ్యానించారు. న్యాయ విద్యను పర్యవేక్షించే అత్యున్నత సంస్థగా తాము మౌన ప్రేక్షక పాత్ర వహించబోమని బీసీఐ స్పష్టం చేసింది. కాగా, జస్టిస్ సూర్య కాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించడాన్ని పునఃపరిశీలించాలని నల్సార్ విద్యార్థుల బృందం వీసీ, రిజిస్ట్రార్, ప్రొఫెసర్లకు వినతిపత్రం సమర్పించడంతో ఈ వివాదం మొదలైంది.

## గేట్ 2027 షెడ్యూల్ రిలీజ్

(మొదటి పేజీ తరువాయి)

సవరించిన రిజిస్ట్రేషన్ షెడ్యూల్‌ను ఐఐటీ మద్రాస్ విడుదల చేసింది. అర్హులైన అభ్యర్థులు ఆగస్టు 14 నుంచి ఆన్‌లైన్ విధానంలో తమ దరఖాస్తులను సమర్పించవచ్చని నిర్వహణ సంస్థ వెల్లడించింది. సాధారణ ఫీజుతో ఆన్‌లైన్ దరఖాస్తులు సమర్పించడానికి సెప్టెంబర్ 21ని ఆఖరి తేదీగా నిర్ణయించారు. నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోలేని విద్యార్థులకు లేట్ ఫీజుతో సెప్టెంబర్ 30 వరకు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు. ఇక అప్లికేషన్‌లో తప్పులుంటే సరిచేసుకోవడానికి అక్టోబర్ 14 నుంచి 21 వరకు కరెక్షన్ విండో అందుబాటులో ఉండనుంది. కాగా 'గేట్' పరీక్షలను వచ్చే ఏడాది ఫిబ్రవరి 6, 7, 13, 14, 20, 21 తేదీల్లో కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహించనున్నారు. పరీక్షకు సంబంధించిన సెంటర్ వివరాలను జనవరి 4న వెల్లడించనుండగా, మార్చి 19న ఫలితాలను విడుదల చేస్తారు. ఈ సారి మొత్తం 30 సబ్జెక్టుల్లో పరీక్ష నిర్వహించనుండగా, అందులో కొత్తగా 'రొబోటిక్స్ అండ్ ఆటోమేషన్' సబ్జెక్టును కూడా చేర్చారు.

## నీట్-యూజీ కౌన్సెలింగ్ షెడ్యూల్ మార్పు

(మొదటి పేజీ తరువాయి)

కింద ఉండే 15 శాతం ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్సీ నర్సింగ్ సీట్ల భర్తీకి సంబంధించి రిజిస్ట్రేషన్, ఛాయిస్ ఫిల్లింగ్ గడువులను పెంచుతూ నూతన తేదీలను ప్రకటించింది. సవరించిన షెడ్యూల్ ప్రకారం విద్యార్థులు ఆగస్టు 15 మధ్యాహ్నం 2 గంటల వరకు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు, సాయంత్రం 5 గంటల వరకు ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పించారు. అదేవిధంగా ఆగస్టు 17 సాయంత్రం 6 గంటల వరకు ఛాయిస్ ఫిల్లింగ్, లాకింగ్ ప్రక్రియను పూర్తి చేయవచ్చని పేర్కొన్నారు. ఇక ఆగస్టు 18న సీటు కేటాయింపు ప్రక్రియను పూర్తి చేసి, ఆగస్టు 19న మొదటి రౌండ్ ఫలితాలను ఎమ్‌సీసీ తన అధికారిక వెబ్‌సైట్లో విడుదల చేయనుంది.

## ఈ పాలన చూస్తుంటే బాధైతుంది!

(మొదటి పేజీ తరువాయి)

ఏపూరి సోమన్న 25 ఏళ్ల పాటల ప్రస్థానంపై రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి.. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన తెలంగాణ రాజకీయాలు, గత ప్రభుత్వ పాలన, ప్రస్తుత పరిస్థితులపై కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీతో సంబంధం లేని కొంతమంది వ్యక్తులు.. ప్రస్తుతం రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో కీలక పదవులు అనుభవిస్తుండటం చాలా బాధాకరంగా ఉందని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తీవ్రంగా విమర్శించారు. గతంలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఉన్న వ్యక్తులు అధికార వ్యవస్థలో కీలక స్థానాల్లో ఉండటంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తాను మాత్రం ప్రతిపక్షంలో ఉన్నా.. అధికార పక్షంలో ఉన్నా ప్రజల పక్షాన నిలబడతానని స్పష్టం చేశారు. ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం అభివృద్ధి పేరుతో భారీగా నిధులను దుర్వినియోగం చేస్తోందని తీవ్ర ఆరోపణలు గుప్పించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తొలిసారిగా తానే గళం వినిపించానని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గుర్తుచేశారు. అందుకే అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ తనను రాజకీయంగా లక్ష్యంగా చేసుకున్నారని పేర్కొన్నారు. మునుగోడు ఉపఎన్నిక సమయంలో తనను ఓడించేందుకు పెద్ద సంఖ్యలో బీఆర్‌ఎస్ నాయకులను రంగంలోకి దించారని.. ఏకంగా 100 మంది ఎమ్మెల్యేలు.. తనకు వ్యతిరేకంగా పనిచేశారని ఆరోపించారు. అయినప్పటికీ తాను ఎదుర్కొన్న రాజకీయ పరిణామాలను ఒక రకంగా విజయంగానే భావిస్తున్నట్లు వ్యాఖ్యానించారు. కళాకారులు, ఉద్యమకారులకు తన మద్దతు ఎప్పటికీ ఉంటుందని ఈ సందర్భంగా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. ఏపూరి సోమన్న పాడిన తెలంగాణ ఉద్యమ గీతాలను ప్రస్తావిస్తూ.. ఆయనలో ప్రజాగాయకుడు గద్దర్ ఛాయలు కనిపిస్తాయని అన్నారు. సోమన్న వంటి కళాకారులకు రాజకీయంగా కూడా అవకాశం రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో ఏపూరి సోమన్న చట్టసభల్లోకి అడుగుపెడతారని తాను ఆశిస్తున్నట్లు చెప్పారు. ప్రజా సమస్యలపై గళం వినిపించే వారికి తాను అండగా ఉంటానని స్పష్టం చేశారు. రాజకీయాల్లో మార్పు తీసుకురావడానికి తనకు సామర్థ్యం ఉందని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. నిజాయితీ కలిగిన నాయకులు, కార్యకర్తలు తన వెంట నిలిస్తే తమిళనాడు తరహాలో తెలంగాణలోనూ రాజకీయ మార్పు తీసుకురావచ్చని అన్నారు. తాను గెలిపించిన ఓ ఎమ్మెల్యే కులాన్ని అడ్డుపెట్టుకుని అవినీతి.. అక్రమాలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు.

# కార్పొరేట్‌కు సాగిల పడ్తరా?

(మొదటి పేజీ తరువాయి)

విచారణ సందర్భంగా ఎఫ్ఎస్ఎస్ఏఐ తీరును ధర్మాసనం తప్పుపట్టింది. ఆహార రంగ పరిశ్రమ ఈ లేబుళ్లను వ్యతిరేకిస్తోందని ఎఫ్ఎస్ఎస్ఏఐ చేసిన వాదనలను పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. మార్చి 7న జరిగిన ఎఫ్ఎస్ఎస్ఏఐ సమావేశం మినిట్స్‌ను పిటిషనర్ తరఫు లాయర్ ప్రస్తావిస్తూ.. అందులో తీసుకున్న నిర్ణయాలు కోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలకు పూర్తిగా విరుద్ధంగా ఉన్నాయని తెలిపారు. ప్యాకెట్లపై హెచ్చరిక లేబుళ్లను ఆహార పరిశ్రమ వ్యతిరేకిస్తోందని పేర్కొంటూ.. దానికి బదులుగా రోజువారీకి అవసరమైన చక్కెర, సంతృప్త కొవ్వులు, ఉప్పు పరిమాణాన్ని తెలియజేసే పట్టిక రూపంలో ఇవ్వాలని ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రతిపాదించింది. అయితే, ఎఫ్ఎస్ఎస్ఏఐ తన అఫిడవిట్‌లో కేవలం ఆహార పరిశ్రమ వ్యతిరేకతను మాత్రమే పేర్కొందని, చక్కెర, ఉప్పు, కొవ్వులు ఎక్కువ ఉన్న ఆహారాల వినియోగాన్ని తగ్గించడానికి హెచ్చరిక లేబుళు ఎంత అవసరమో పౌర సమాజం ప్రతినిధులు సమర్పించిన ఆధారాలను పూర్తిగా విస్మరించిందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన ధర్మాసనం.. ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా లేదా? అని కేంద్రం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ బ్రిజేందర్ చాహర్‌ను సూటిగా ప్రశ్నించింది. అంతేకాదు, తమ ఉత్తర్వులు స్పష్టంగా ఉన్నాయని పునరుద్ఘాటించింది. బడా కార్పొరేట్ సంస్థల నుంచి ప్రభుత్వం తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటోందని, దానికి 'తలొగ్గుతోందని' వ్యాఖ్యానించింది. కేవలం ప్రజా ప్రయోజనాల కోసమే తాము ఈ చర్యలు తీసుకుంటున్నామని ధర్మాసనం పేర్కొంది. కోర్టు ఆదేశాలను ఎందుకు అమలు చేయడం లేదని, ఇప్పటివరకు ప్రభుత్వం తీసుకున్న చర్యలేమిటో చెప్పాలని నిలదీసింది. 'ప్రభుత్వమే స్వయంగా ఈ పని చేస్తుందా, లేక మేమే ఉత్తర్వులు జారీ చేయాలా?' అని కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభుత్వం తీసుకోబోయే చర్యలను వివరించడానికి అనుమతించాలని అదనపు సొలిసిటర్ జనరల్ కోరగా, తమ ఆదేశాలను ప్రభుత్వం అమలుచేసి తీరాల్సిందేనని తేల్చిచెప్పింది. 'మీరు చేయలేకపోతే, మేమే తగిన ఉత్తర్వులు ఇస్తాం' అని ధర్మాసనం స్పష్టం చేసింది. సంప్రదాయ భారతీయ ఆహార పదార్థాల ఉదాహరణలను ప్రస్తావిస్తూ, ఈ ప్రతిపాదిత నిబంధనల వల్ల నామ్‌కీన్ వంటి అనేక ఉత్పత్తులపై 'రెడ్ వార్నింగ్ మార్కులు' వచ్చే అవకాశం ఉందని కేంద్రం వాదించింది. అభివృద్ధి చెందిన దేశాల్లోని ఆహార పదార్థాల్లో ఉప్పు, చక్కెర, కొవ్వు స్థాయిలు తక్కువగా ఉంటాయని, కాబట్టి ఆ ప్రమాణాలను నేరుగా భారతీయ సంప్రదాయ ఆహారాలకు వర్తింపజేయడం సరికాదని ఏసీజీ వాదించారు. అభివృద్ధి చెందిన దేశాలు పాటించే అంతర్జాతీయ ప్యాకేజింగ్ ప్రమాణాలను భారత్ పాటించడం కష్టమన్న కేంద్రం వాదనను నిరాకరిస్తూ "భారత్ ఎప్పటికీ అభివృద్ధి చెందని దేశంగానే ఉండిపోవాలా?' అని కోర్టు ప్రశ్నించింది. దేశ ప్రజల, ముఖ్యంగా పిల్లల ఆరోగ్యాన్ని కాపాడటం ప్రభుత్వానికి ఇష్టం లేదా అని నిలదీసింది. 'తయారీదారులకు ఇది నచ్చకపోవచ్చు, కానీ వినియోగదారునికి అసలు విషయం తెలియాలి' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. హెచ్చరిక లేబుల్ ముఖ్య ఉద్దేశం విక్రయాలను నిలిపివేయడం కాదని, తాము ఏమి తింటున్నారో వినియోగదారులకు తెలియజేయడమేనని స్పష్టం చేసింది. 'తయారీదారులు తమ వ్యాపారం దెబ్బతింటుందని దీనిని ఇష్టపడకపోవచ్చు, కానీ హెచ్చరిక బోర్డు ఉన్నప్పటికీ ఆ ఉత్పత్తిని కొనాలా? వద్దా? అనే తుది నిర్ణయం వినియోగదారుడిదే అవుతుంది' అని పేర్కొంది. కేంద్రం వాదనలను తోసిపుచ్చిన కోర్టు.. 'ఈ విషయంలో తయారీదారులదే నిర్ణయాత్మక పాత్ర కాదు' అని వ్యాఖ్యానించింది. లేబులింగ్ ప్రతిపాదనను అమలు చేయడానికి కేంద్రానికి రెండు వారాల గడువు ఇచ్చిన ధర్మాసనం.. తదుపరి విచారణలో తీర్పు వెలువరిస్తామని హెచ్చరించింది.



## అంబులెన్స్ లేటైతే రూ.10 వేల జరిమానా

**సమాచారం అందిన 10 నిమిషాల్లో స్పాట్‌లో ఉండాలి**

**ఎన్‌హెచ్ఏఐ కీలక ఆదేశాలు జారీ**

న్యూఢిల్లీ: జాతీయ రహదారులపై ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులకు అత్యవసర వైద్య సేవలు అందించడంలో నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) కీలక నిర్ణయం తీసుకుంది. హైవేలపై ప్రమాద వార్త సమాచారం అందిన వెంటనే అంబులెన్సులు 10 నిమిషాల్లోనే యాక్సిడెంట్ స్పాట్ కు చేరుకోవాలని ఎన్ హెచ్ ఏఐ గడువు విధించింది. అంబులెన్సులు క్షతగాత్రుల్ని గోల్డెన్ అవర్‌లో ఆస్పత్రికి తరలించాలని పేర్కొంది. ఈ గడువును పాటించడంలో ఆలస్యమైతే రూ.10వేల జరిమానా విధిస్తామని హెచ్చరించింది. ఎన్‌హెచ్ఏఐ కేర్ సిస్టమ్ వినియోగం ద్వారా సంఘటనల నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేసే లక్ష్యంతో , అంబులెన్సులు, క్రేన్లు, పెట్రోలింగ్ వాహనాలతో సహా ఆన్-రోడ్ యూనిట్ల పంపకాన్ని సమర్థవంతంగా నిర్వహించడానికి ఈ ప్రభుత్వ రంగ సంస్థ కొత్త నిబంధనలను విడుదల చేసింది. ఎక్కడైనా జాతీయ రహదారిపై ప్రమాదం జరిగిన ప్రదేశం 10 కిలోమీటర్ల పరిధిలో ఉంటే ఎన్‌హెచ్ఏఐ తాజా నిబంధనల ప్రకారం అంబులెన్స్ 10 నిమిషాల్లోపు అక్కడికి చేరుకోవాల్సి ఉంటుంది. 10 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం ఉంటే, ఆ మేరకు సమయం పెరుగుతుంది. దీనిని +రూ డేట, ఎన్‌హెచ్ఏఐ కేర్ డ్యాష్‌బోర్డ్ ద్వారా నిత్యం పర్యవేక్షిస్తారు. ప్రమాద కాల్ స్వీకరించిన సమయం నుంచి 1 గంటలోపు బాధితులను సమీపంలోని ఆసుపత్రికి తరలించాలి. ఇందులో ఆలస్యం చేస్తే రూ.10,000 జరిమానా పడనుంది. అత్యవసర సమయంలో అంబులెన్స్ సిబ్బంది ఎమర్జెన్సీ కాల్‌ను తిరస్కరిస్తే కూడా రూ.10 వేల పెనాల్టీ విధిస్తారు. అదేవిధంగా ఒప్పందం ప్రకారం అంబులెన్స్‌లో ఉండాల్సిన వైద్య పరికరాలు, మందులు, సిబ్బంది లేకపోయినా రూ.10 వేల జరిమానా విధించనున్నారు. అన్ని అంబులెన్స్‌లు, పెట్రోలింగ్ వాహనాలకు జీపీఎస్, ఎన్ హెచ్ ఏఐ కేర్ యాప్ లైవ్‌లో ఉండాలని ఎన్‌హెచ్ఏఐ స్పష్టం చేసింది. సాంకేతిక లోపాలకు రూ. 2,500 జరిమానా ఉంటుంది. జాతీయ రహదారులపై అత్యవసర సహాయం కోసం 1033 నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొంది.

# 130 జలాశయాల్లో పంప్డ్ స్టోరేజ్!?

## ప్రాజెక్టులపై ఏపీ సీఎం చంద్రబాబు ఫోకస్.. సెప్టెంబర్ నాటికి 6 లక్షల 'సూర్య ఘర్' కనెక్షన్ల ఏర్పాటుకు ఆదేశం



అమరావతి, ఆగస్టు 13 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌ను ఇంధన రంగంలో అగ్రగామిగా నిలబెట్టే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలోని 130 జలాశయాల్లో పంప్డ్ స్టోరేజ్ ఎనర్జీ ప్రాజెక్టుల ఏర్పాటుకు గల అవకాశాలు, సాధ్యసాధ్యాలపై సమగ్రంగా అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. గురువారం ఇంధన శాఖ పనితీరుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ఈ దిశానిర్దేశం చేశారు. పోలవరం ప్రాజెక్టు వద్ద పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు ఏర్పాటు ప్రతిపాదనపై చర్చిస్తూ, రాష్ట్రంలోని ఇతర జలాశయాల వద్ద కూడా ఇలాంటి ప్రాజెక్టుల ఆర్థిక సాధ్యతపై నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా జలాశయాల నుంచి విద్యుదుత్పత్తికి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ ఉత్పత్తి కొనసాగేలా ముందుగానే అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పారిశ్రామికీకరణ వేగవంతం అవుతున్నందున, ప్రతి ఆరేళ్లకు విద్యుత్ వినియోగం రెట్టింపు అయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు. పెరుగుతున్న ఈ డిమాండ్‌కు అనుగుణంగా విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని, తక్కువ ధరకే విద్యుత్‌ను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అదే సమయంలో విద్యుత్ పంపిణీ నష్టాలను మరింత తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సౌర విద్యుత్ ఉత్పత్తిని గరిష్ఠ స్థాయికి తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 'పీఎం సూర్య ఘర్' పథకం కింద సెప్టెంబర్ నాటికి 6 లక్షల సోలార్ కనెక్షన్లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఈ పథకం కిందకు రాని మరో మూడు లక్షల కనెక్షన్లను కూడా వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. దీంతోపాటు, మరో 10 లక్షల కనెక్షన్ల కోసం కేంద్రానికి దరఖాస్తు చేయాలని అధికారులకు సూచించారు. 'పీఎం-కుసుమ్' పథకం కింద నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయడంతో పాటు, అదనంగా 2,000 మెగావాట్ల సామర్థ్యం కోసం కేంద్రాన్ని అభ్యర్థించాలని తెలిపారు. తక్కువ ఖర్చుతో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసే వ్యవస్థను రూపొందించేందుకు సౌర, పవన, పంప్డ్ స్టోరేజ్ వనరులను అనుసంధానం చేయాల్సిన అవసరాన్ని చంద్రబాబు నొక్కిచెప్పారు. ఈ ఏడాది సగటు విద్యుత్ కొనుగోలు ఖర్చును యూనిట్‌కు రూ. 4.60కి, 2029 నాటికి రూ. 4కి తగ్గించాలని స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించారు. రాష్ట్రంలోని ఆరు విద్యుత్ సంస్థల (యుటిలిటీల) పనితీరును మెరుగుపరిచేందుకు 'పనితీరు ఆధారిత రేటింగ్' విధానాన్ని ప్రవేశపెట్టాలని సూచించారు. ప్రతి సంస్థకు స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించి, అగ్రశ్రేణి కార్పొరేట్ సంస్థలతో పోటీపడేలా వాటిని తీర్చిదిద్దాలని అన్నారు. ఈ సందర్భంగా, విద్యుత్ కొనుగోళ్లలో ఆప్టిమైజేషన్ ద్వారా రూ. 234 కోట్లు ఆదా అయినట్లు, సకాలంలో చెల్లింపులు చేయడం వల్ల రిబేట్ల రూపంలో మరో రూ. 100 కోట్లు ఆదా అయినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811
నంబర్‌ను సంప్రదించవచ్చు.

## రాజమండ్రిలో గంజాయి పట్టివేత

రాజమండ్రి, ఆగస్టు 13 (ఈవార్తలు): ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి సమీపంలో పోలీసులు భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీలేరు ఏజెన్సీ ప్రాంతం నుంచి విజయవాడకు కారులో అక్రమంగా తరలిస్తున్న 25.970 కిలోల గంజాయిని పట్టుకుని, ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాల్లోకి వెళ్తే.. రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా ఉన్న ఒక కారును ఆపి సోదా చేయగా, మూడు పాలిథిన్ సంచుల్లో నిల్వ చేసిన గంజాయి లభ్యమైంది. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.4.29 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. నిందితులను ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం సరిపల్లె గ్రామానికి చెందిన దులపల్లి సుజీవ్ కుమార్, మొదుగు నరేష్‌గా గుర్తించారు. వారి వద్ద నుంచి ఒక కారు, రెండు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ గంజాయిని విజయవాడకు చెందిన చినంశెట్టి రాజేష్ అనే వ్యక్తికి చేరవేసేందుకు తరలిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. సీలేరులో గంజాయిని సరఫరా చేసిన చింటూ అనే వ్యక్తితో పాటు రాజేష్ ప్రస్తుతం పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై రాజానగరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

## అమెరికాలో 600 మంది గర్భిణుల వీసాలు తిరస్కరణ

**పిల్లలు కనేందుకు వస్తున్నారని కీలక నిర్ణయం**

వాషింగ్టన్: అమెరికా పౌరసత్వ చట్టాలను దుర్వినియోగం చేస్తూ సాగుతున్న 'బర్త్ టూరిజం'పై అమెరికా విదేశాంగ శాఖ అత్యంత కఠినమైన చర్యలకు ఉపక్రమించింది. కేవలం పిల్లలకు జన్మను ఇచ్చి, వారికి అమెరికా పౌరసత్వం కల్పించాలనే ఏకైక లక్ష్యంతో దేశంలోకి ప్రవేశించే విదేశీయుల ఆట కట్టించేందుకు ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. ఈ క్రమంలోనే విదేశీ గర్భిణీలకు సంబంధించిన 600కి పైగా వీసాలను అమెరికా రద్దు చేసింది. అయితే ఇంత భారీ స్థాయిలో రద్దు అయిన వీసాలు.. కేవలం ఒక్క నెలలోనే కావడం గమనార్హం. ఈ తరహా చట్టవిరుద్ధ కార్యకలాపాలను అడ్డుకోవడానికి అమెరికా విదేశాంగ శాఖ ప్రత్యేకంగా "బర్త్ టూరిజం ప్రివెన్షన్ టాస్క్‌ఫోర్స్"ను రంగంలోకి దించింది. వీసాదారుల కదలికలు, దరఖాస్తులను సమగ్రంగా సమీక్షించడం, వీసా వ్యవస్థను మోసం చేస్తున్న అక్రమ బర్త్ టూరిజం నెట్‌వర్క్‌లను పూర్తిగా ధ్వంసం చేయడం ఈ టాస్క్‌ఫోర్స్ ముఖ్య ఉద్దేశం. అయితే బాధ్యతలు చేపట్టిన మొదటి నెలలోనే ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలకు చెందిన 600 మందికి పైగా విదేశీ గర్భిణీల వీసాలను ఈ టాస్క్‌ఫోర్స్ రద్దు చేసింది. వీరంతా 9వ నెల గర్భంతో జులై నెలలోనే అమెరికాకు వచ్చారు. అక్కడికెళ్లాకే యూఎస్ వీరికి గట్టి షాక్ ఇస్తూ వీసాలు రద్దు చేసింది. ఈ చర్యలపై అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో స్పందిస్తూ.. సంచలన వ్యాఖ్యలు చేశారు. బర్త్ టూరిజం నెట్‌వర్క్‌లు విదేశీయులకు ఆశజూపి, వీసా విధానాన్ని ఎలా మోసం చేయాలో శిక్షణ ఇస్తున్నాయని ఆరోపించారు. ప్రయాణ ఏర్పాట్లు, తాత్కాలిక నివాసం కల్పించడంతో పాటు నకిలీ పత్రాలను సృష్టించి పిల్లలకు అమెరికా పౌరసత్వం వచ్చేలా చేస్తున్నారని మండిపడ్డారు. "అమెరికా పౌరసత్వం ఎంతమాత్రం అమ్మకానికి లేదు" అని రూబియో స్పష్టం చేశారు. దేశ చట్టాలను భంగపరిచే ఇలాంటి అక్రమ విధానాలను అడ్డుకునేందుకు లభ్యం అయ్యే అన్ని రకాల చట్టపరమైన మార్గాలను ఉపయోగిస్తామని.. పౌరసత్వ విశిష్టతను కాపాడుతామని ఉద్ఘాటించారు. ఒకవైపు బర్త్ టూరిజంపై అమెరికా తీసుకుంటున్న ఈ తీవ్ర చర్యలతో పాటు వీసా నిబంధనలను అత్యంత కఠినతరం చేయడం విదేశీ విద్యార్థులపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది. కఠిన తనిఖీలు, మారిన నిబంధనల వల్ల ఈ ఏడాది అమెరికాకు వచ్చే విదేశీ విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోయింది. గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది 'ఫాల్ సీజన్'లో ఏకంగా 1.12 లక్షల మంది విద్యార్థుల సంఖ్య తగ్గడం గమనార్హం. ఇదిలా ఉండగా.. రాబోయే రోజుల్లో కూడా ఈ తనిఖీలు, నిబంధనల అమలు మరింత కఠినంగా కొనసాగుతుందని విదేశాంగ శాఖ మరోసారి స్పష్టం చేసింది..

## రేషన్ కార్డుపై 9 సెక్యూరిటీ ఫీచర్లు

**క్యూఆర్ కోడ్, హోలోగ్రామ్, యూవీ లోగో వంటి అత్యాధునిక ఫీచర్లు**

**ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత పెంచడమే లక్ష్యంగా అడుగులు**

హైదరాబాద్, ఆగస్టు 13 (ఈవార్తలు): తెలంగాణలో రేషన్ కార్డుల దుర్వినియోగాన్ని అరికట్టడంతో పాటు నకిలీ కార్డులకు అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అత్యాధునిక భద్రతా ప్రమాణాలతో కూడిన కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను జారీ చేసేందుకు సిద్ధమైంది. మొత్తం తొమ్మిది రకాల సెక్యూరిటీ ఫీచర్లతో రూపొందించిన ఈ కార్డుల పంపిణీని స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న ప్రారంభించనున్నారు. సంగారెడ్డి వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకతను పెంపొందించి, సామర్థ్యాన్ని పెంచడమే లక్ష్యంగా పౌరసరఫరాల శాఖ ఈ నూతన కార్డులను అందుబాటులోకి తీసుకువస్తోంది. అధికారిక వర్గాల సమాచారం ప్రకారం, ఈ కార్డులలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ అధికారిక సంతకం, తెలంగాణ ప్రభుత్వ అధికారిక హోలోగ్రామ్‌తో పాటు, స్పర్శతో గుర్తించేలా "గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ" అనే అక్షరాలు ఉంటాయి. సాధారణ ముద్రణతో నకిలీ చేయడానికి వీలులేని మైక్రోటెక్స్ట్, ప్రత్యేక కోణంలో చూసినప్పుడు మాత్రమే కనిపించే 'గో టీజీ', 'ఒరిజినల్' వంటి పదాలను కూడా ఇందులో పొందుపరిచారు. వీటితో పాటు, కాంతికి ఎదురుగా ఉంచినప్పుడు కనిపించే వాటర్‌మార్క్ లోగో, అతినీలలోహిత కాంతిలో మెరిసే ఇన్విజిబుల్ లోగో, కార్డు వివరాలను ధ్రువీకరించే ఎన్‌క్రిప్టెడ్ క్యూఆర్ కోడ్, గిలోష్ ప్యాటర్న్ వంటి అత్యాధునిక సాంకేతికతను జోడించారు.

## నన్నూ అవమానించారు: జగన్

**కర్నూలు జైలులో విరూపాక్షికి వైసీపీ అధినేత పరామర్శ**



కర్నూలు, ఆగస్టు 13 (ఈవార్తలు): ఏపీలో అధికార దుర్వినియోగం ఏ స్థాయిలో ఉందో చెప్పడానికి ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్టు ఘటనే నిలువెత్తు నిదర్శనమని వైసీపీ అధినేత జగన్ అన్నారు. కర్నూలు జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న ఎమ్మెల్యే విరూపాక్షిని గురువారం ఆయన ములాఖత్‌లో భాగంగా కలిశారు. అనంతరం జైలు బయట మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు 'రెడ్ బుక్' రాజ్యాంగాన్ని అమలు చేస్తూ, ప్రతిపక్ష నేతలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తాను ఇవాళ జైలుకు వస్తే తనను కూడా అవమానించే ప్రయత్నం చేశారని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. "ఒక మాజీ ముఖ్యమంత్రిగా వచ్చిన నన్ను లోపల కూర్చోబెట్టి ఫోటో తీయకుండా, గ్రిల్స్ బయట నిలబెట్టి ఫోటో తీశారు. ఇది చంద్రబాబు శాడిస్టిక్ మనస్తత్వానికి నిదర్శనం. మా హయాంలో పీపుల్ ఫ్రెండ్లీ పోలీస్ స్టేషన్లు తీసుకొస్తే, వీళ్లు అవమానించే సంస్కృతిని తెచ్చారు" అని అన్నారు. ప్రభుత్వాలు శాశ్వతం కాదని చంద్రబాబు గుర్తుంచుకోవాలని జగన్ హెచ్చరించారు. "ఈరోజు మీరు ఏ తప్పుడు విత్తనాలు నాటుతున్నారో, అవే రేపు మహావృక్షాలై మిమ్మల్ని రెండింతలుగా చుట్టుకుంటాయి. ఈ కక్ష సాధింపు రాజకీయాలు మానుకోకపోతే తీవ్ర పరిణామాలు తప్పవు" అని జగన్ హెచ్చరించారు. సమయం వేగంగా గడిచిపోతుందని, ఈ దుర్మార్గపు పాలనకు ప్రజలు త్వరలోనే చరమగీతం పాడతారని ఆయన వ్యాఖ్యానించారు. "ఈ వెన్నుపోటు పార్టీ పాలనలో బాధితులే నిందితులుగా మారుతున్నారు. దాడికి గురైన వారిపైనే కేసులు పెడుతున్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిని అక్రమంగా అరెస్టు చేస్తున్నారు. దీనికి విరూపాక్షి ఉదంతమే ప్రబల ఉదాహరణ" అని జగన్ పేర్కొన్నారు. ఆగస్టు 1న చిప్పగిరి మండలం సంగాల గ్రామంలో తమ పార్టీ కార్యకర్త గిరి తనపై దాడి జరుగుతోందని, రక్షించమని రాత్రి 7:45 గంటలకు ఎమ్మెల్యే విరూపాక్షికి ఫోన్ చేసి, వీడియోలు పంపాడని జగన్ ఆధారాలను చూపుతూ వివరించారు. వెంటనే ఎమ్మెల్యే స్థానిక ఎస్పైకి 7:47 గంటలకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చినా పోలీసులు స్పందించలేదన్నారు. పైగా, కార్యకర్తను కాపాడటానికి వెళ్లిన ఎమ్మెల్యేపై దాడి చేశారని, ఆయన తమ్ముడి చేయి విరగ్గొట్టారని ఆరోపించారు. దాడికి గురైన విరూపాక్షి ఫిర్యాదును పోలీసులు తీసుకోకపోగా, అర్ధరాత్రి 2:45 గంటలకు వందల మంది పోలీసులు దొంగల్లా ఆయన ఇంటిపై పడి, తలుపులు, సీసీ కెమెరాలు ధ్వంసం చేసి, ఒక ఉగ్రవాదిని పట్టుకున్నట్లు అరెస్టు చేశారని జగన్ మండిపడ్డారు. గంటల వ్యవధిలోనే ఎమ్మెల్యేపై, ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు కలిపి మొత్తం 38 మందిపై మూడు వేర్వేరు అక్రమ కేసులు బనాయించి జైల్లో పెట్టారని తెలిపారు. ఒకే వ్యక్తి పేరును ఎఫ్ఐఆర్‌లో రెండుసార్లు చేర్చడం చూస్తే, కేసు ఎంత కట్టుకథో అర్థమవుతోందన్నారు. ఈ ప్రభుత్వం బీసీ, మైనారిటీ వర్గాల నాయకత్వాన్ని అణిచివేసేందుకు కుట్ర చేస్తోందని జగన్ ఆరోపించారు. మాజీ మంత్రి అప్పలరాజు కుమారుడి బైక్ యాక్సిడెంట్‌ను హత్యాయత్నంగా చిత్రీకరించడం, మాజీ ఎమ్మెల్యే ముస్తఫాపై కిడ్నాప్ కేసు పెట్టడం, కారుమూరు సునీల్‌పై అక్రమ కేసులు బనాయించడం వంటివి ఇందులో భాగమేనని విమర్శించారు.

## ఏపీలో కొత్తగా 6 పైలట్ శిక్షణ కేంద్రాలు

**ప్రైవేటు సంస్థల ఆధ్వర్యంలో శిక్షణ**

**ఒక్కో కేంద్రంలో 30-40 మందికి ట్రైనింగ్**

**టీజీలోని నాగార్జునసాగర్‌లోనూ శిక్షణ**

హైదరాబాద్, ఆగస్టు 13 (ఈవార్తలు): ఏపీ ఏవియేషన్ రంగంలో ఒక కీలక ముందడుగు పడింది. రాష్ట్రంలో పైలట్ శిక్షణ కోసం ఎదురుచూస్తున్న యువతకు శుభవార్త అందిస్తూ, ప్రభుత్వం కొత్తగా ఆరు ఫ్లయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ల (ఎఫ్‌టీవో) ఏర్పాటుకు మార్గం సుగమం చేసింది. ఇప్పటివరకు రాష్ట్రంలో అందుబాటులో లేని ఈ సౌకర్యం కర్నూలు, కడప, రాజమహేంద్రవరం విమానాశ్రయాల వేదికగా ప్రారంభం కానుంది. ఈ కేంద్రాల రాకతో ఏపీ ఏవియేషన్ శిక్షణలో ఒక ముఖ్య కేంద్రంగా మారే అవకాశం ఉంది. మొత్తం మూడు విమానాశ్రయాల్లో ఆరు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఏపీఏడీసీఎల్ (ఆంధ్రప్రదేశ్ విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ) నిర్వహణలో ఉన్న కర్నూలు విమానాశ్రయంలో రెండు ఎఫ్‌టీవోలు రానున్నాయి. వీటిలో మొదటి కేంద్రాన్ని ఈ నెల 22న ప్రారంభించనుండగా, మరొకటి డిసెంబర్ నాటికి అందుబాటులోకి వస్తుంది. ఇక, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) పరిధిలోని రాజమహేంద్రవరం, కడప విమానాశ్రయాల్లో రెండేసి చొప్పున కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. రాజమహేంద్రవరంలో టెండర్ల ప్రక్రియ పూర్తికాగా, ఆరు నెలల్లో కార్యకలాపాలు ప్రారంభమవుతాయని అధికారులు చెబుతున్నారు. కడపలో ప్రస్తుతం టెండర్ల ప్రక్రియ మొదలైంది. తిరుపతి విమానాశ్రయంలో కూడా ఎఫ్‌టీవోల ఏర్పాటు ప్రతిపాదన పరిశీలనలో ఉంది. డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) నుంచి అనుమతి పొందిన ప్రైవేటు సంస్థలు ఈ శిక్షణ కేంద్రాలను నిర్వహిస్తాయి. ఒక్కో కేంద్రం ద్వారా సుమారు 30 నుంచి 40 మందికి పైలట్ శిక్షణ ఇస్తారు. కమర్షియల్ పైలట్ లైసెన్స్ పొందడానికి అవసరమైన 180 గంటల విమాన శిక్షణను ఈ కేంద్రాల్లో పూర్తి చేయవచ్చు. ఇందుకోసం ఆయా సంస్థలు ఎయిర్‌పోర్ట్ రన్‌వేకు అనుసంధానంగా ప్రత్యేక హ్యాంగర్లు నిర్మించి, చిన్న విమానాల ద్వారా శిక్షణ అందిస్తాయి. వీటితో పాటు నాగార్జున సాగర్ వద్ద ఉన్న ఎయిర్‌స్ట్రిప్‌లో కూడా ఒక ఎఫ్‌టీవోను ఏర్పాటు చేసేందుకు ఏపీఏడీసీఎల్ ఇప్పటికే అనుమతులు పొందింది. భవిష్యత్తులో అక్కడ కొత్త విమానాశ్రయాన్ని నిర్మించాలనే ప్రభుత్వ ప్రణాళికకు అనుగుణంగా ప్రస్తుత ఎయిర్‌స్ట్రిప్‌ను ఏపీఏడీసీఎల్‌కు బదిలీ చేసే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈ పరిణామాలతో పైలట్ శిక్షణ కోసం యువత ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం తప్పుతుంది.

## ఏపీలో మోగనున్న స్థానిక నగారా

**ఓటర్ల జాబితాల ప్రచురణకు ఆదేశాలు**

విజయవాడ, ఆగస్టు 13 (ఈవార్తలు): ఏపీలో ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి కీలక ముందడుగు పడింది. రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) ఓటర్ల జాబితాల ప్రచురణకు నోటిఫికేషన్లు జారీ చేయడంతో ఎన్నికల ప్రక్రియ అధికారికంగా ప్రారంభమైనట్టయింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా, మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో సెప్టెంబర్ 3న ఫొటో ఎలక్టోరల్ రోల్స్‌ను ప్రచురించాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే, గతంలో జాబితాలు ప్రచురించని 20 గ్రామ పంచాయతీల్లో ఆగస్టు 17న ఓటర్ల జాబితాలను ప్రకటించాలని స్పష్టం చేశారు. ఈ మేరకు ఎన్నికల నిర్వహణకు యంత్రాంగాన్ని సిద్ధం చేసే పనులను ఎస్ఈసీ వేగవంతం చేసింది. ఇటీవల మున్సిపల్, పంచాయతీ రాజ్ శాఖల కార్యదర్శులతో కమిషనర్ పునేఠా సమావేశమై ఏర్పాట్లపై చర్చించారు. ఎన్నికల నిర్వహణలో మొదటి దశ అయిన ఓటర్ల జాబితాల ప్రకటనతో ఈ కసరత్తు మొదలైంది. రాష్ట్రవ్యాప్తంగా 123 కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లోని 4,033 డివిజన్లు, వార్డులకు ఓటర్ల జాబితాలను ప్రచురించనున్నారు. వీటిలో 17 కార్పొరేషన్లు, 88 మున్సిపాలిటీలు, 18 నగర పంచాయతీలు ఉన్నాయి. 2021లో కొన్ని చోట్ల న్యాయస్థానాల్లో కేసుల కారణంగా ఎన్నికలు నిలిచిపోగా, ఈసారి అన్నిచోట్లా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు, గ్రామ పంచాయతీల్లో కూడా ఎన్నికల ప్రక్రియ ఊపందుకుంది. ఈ నెల 21 నుంచి 31వ తేదీలోగా రాష్ట్రంలోని 13 వేలకు పైగా గ్రామ పంచాయతీల్లో పోలింగ్ కేంద్రాల జాబితాలను ప్రచురించాలని, వార్డుల వారీగా ఓటర్ల జాబితాలను ఖరారు చేయాలని ఆదేశించారు. 2026 జనవరి 1వ తేదీని అర్హతగా తీసుకుని తుది ఓటర్ల జాబితాలను సిద్ధం చేయనున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో మేయర్లు, ఛైర్మన్లు, కార్పొరేటర్లు, రిజర్వేషన్లను ఖరారు చేసే అవకాశం ఉంది. ఈ పరిణామాలతో అంతా ప్రణాళిక ప్రకారం జరిగితే సెప్టెంబర్ లేదా అక్టోబర్ నెలల్లో స్థానిక ఎన్నికలు జరగవచ్చని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## ఫ్రీ కుట్టుమిషన్ల దరఖాస్తు రేపటి నుంచే

(మొదటి పేజీ తరువాయి)

మహిళలకు ప్రయోజనం కల్పించనున్నారు. తెలంగాణలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 1,000 కుట్టుమిషన్ల చొప్పున పంపిణీ చేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో కుట్టుమిషన్ విలువ రూ.12 వేలు కాగా.. లబ్ధిదారుల నుంచి ఎలాంటి మొత్తం వసూలు చేయకుండా 100 శాతం సబ్సిడీపై అందజేయనున్నారు. ఈ పథకం కింద ప్రయోజనం పొందాలనుకునే అర్హులైన బీసీ మహిళలు ఆగస్ట్ 15వ తేదీ నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. కుట్టు వృత్తిపై ఆసక్తి ఉన్న నిరుద్యోగ మహిళలకు స్వయం ఉపాధి కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. లబ్ధిదారుల ఎంపికలో పేదలు, వితంతువులు, ఒంటరి మహిళలు, నిరాశ్రయులు, అనాథలు, వికలాంగులు, అలాగే కుట్టు వృత్తిలో అనుభవం ఉన్న మహిళలకు నిబంధనల ప్రకారం ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా, నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారమే ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. కేవలం కుట్టుమిషన్లు పంపిణీ చేయడమే కాకుండా వాటిని సరిగ్గా వినియోగించుకునేలా అవసరమైన శిక్షణను కూడా అందించనున్నారు. మహిళలను ప్రభుత్వ పథకాల లబ్ధిదారులుగా మాత్రమే కాకుండా స్వయం ఉపాధి పొందే మహిళా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని మంత్రి పొన్నం పేర్కొన్నారు. మొదటి దశలో 1.19 లక్షల మంది మహిళలకు అవకాశం కల్పించనున్నారు. భవిష్యత్‌లో పథకాన్ని మరింత విస్తరించి అదనపు లబ్ధిదారులకు ప్రయోజనం అందించే అంశాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించనుంది. ఇంటి వద్ద నుంచే కుట్టు పనులు చేసుకుంటూ ఆదాయం సంపాదించేందుకు ఈ పథకం దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

## రూ.1కే సిమ్, ఫ్రీ కాల్స్


(మొదటి పేజీ తరువాయి)

కోసం కేవలం ఒక్క రూపాయికే 'ఫ్రీడమ్ ప్లాన్'ను తిరిగి అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ ప్లాన్ కింద ఉచిత సిమ్ కార్డుతో పాటు, 24 రోజుల వ్యాలిడిటీతో అపరిమిత వాయిస్ కాల్స్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు, 1 జీబీ హై-స్పీడ్ డేటా లభిస్తాయి. ఈ ఆఫర్ కేవలం కొత్తగా బీఎస్ఎన్ఎల్ కనెక్షన్ తీసుకునే వారికి మాత్రమే వర్తిస్తుంది. ప్రస్తుత వినియోగదారులకు ఈ సౌకర్యం అందుబాటులో ఉండదు. ఈ పరిమిత కాల ఆఫర్ 2026 సెప్టెంబర్ 12 వరకు మాత్రమే చెల్లుబాటు అవుతుంది. ఆసక్తి గలవారు బీఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీస్ సెంటర్ లేదా అధీకృత రిటైలర్లను సంప్రదించి, కేవైసీ ప్రక్రియను పూర్తి చేయడం ద్వారా కనెక్షన్‌ను యాక్టివేట్ చేసుకోవచ్చు. గతేడాది కూడా బీఎస్ఎన్ఎల్ 'ఆజాదీ కా ప్లాన్' పేరుతో ఇటువంటి ఆఫర్‌ను ప్రవేశపెట్టింది. అప్పట్లో 30 రోజుల వ్యాలిడిటీతో పాటు రోజుకు 2 జీబీ డేటాను అందించింది. అయితే, ఈసారి 'ఫ్రీడమ్ 2.0' వెర్షన్‌లో వ్యాలిడిటీతో పాటు రోజువారీ డేటా పరిమితిని కూడా తగ్గించింది. ఇదే స్వాతంత్ర్య దినోత్సవ ఆఫర్‌లో భాగంగా, బీఎస్ఎన్ఎల్ తన రూ. 2,399 వార్షిక ప్రీపెయిడ్ ప్లాన్‌ను కూడా అప్‌గ్రేడ్ చేసింది. ఆగస్టు 12 నుంచి సెప్టెంబర్ 12 మధ్య ఈ ప్లాన్‌తో రీఛార్జ్ చేసుకునే వారికి 47 రోజుల అదనపు వ్యాలిడిటీ లభిస్తుంది. దీంతో మొత్తం వ్యాలిడిటీ 412 (365+47) రోజులకు పెరుగుతుంది. ఈ ప్లాన్‌లో అపరిమిత కాల్స్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు, 2 జీబీ డేటా ప్రయోజనాలు యథాతథంగా కొనసాగుతాయి. తమ 4జీ నెట్‌వర్క్‌లోకి కొత్త వినియోగదారులను ఆకర్షించే ప్రయత్నాల్లో భాగంగానే ఈ ఆఫర్లను ప్రకటించినట్లు బీఎస్ఎన్ఎల్ పేర్కొంది.

# అవయవదానం.. కొత్త జీవితానికి మార్గం

## అపోహలను వీడి అవయవదానంపై అవగాహన పెంచుకోవాలి.. నిమ్స్ నెఫ్రాలజీ విభాగాధిపతి డాక్టర్ భూషన్ రాజు

**పీఐబీ హైదరాబాద్ ఆధ్వర్యంలో 'వార్త' మీడియా కార్యశాల**




హైదరాబాద్, ఆగస్టు 13 (పీఐబీ): అవయవదానం మరణించిన వ్యక్తి మరో వ్యక్తికి కొత్త జీవితాన్ని అందించే ఉదాత్తమైన కార్యమని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ నెఫ్రాలజీ విభాగాధిపతి, ఎస్‌వోటీటీవో (జీవన్‌దాన్) విభాగాధిపతి డాక్టర్ భూషణ్ రాజు అన్నారు. ప్రపంచ అవయవదాన దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ కవాడిగూడలోని సీజీవో టవర్స్‌లో ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ఆధ్వర్యంలో 'అవయవదానం: అపోహలు--వాస్తవాలు' అంశంపై 'వార్త' మీడియా కార్యశాల నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ శ్రీ భూషణ్ రాజు మాట్లాడుతూ.. వైద్య శాస్త్రంలో అవయవ మార్పిడి విధానాలు ఎంతో అభివృద్ధి చెందినప్పటికీ, మానవ అవయవాలను పూర్తిగా కృత్రిమంగా తయారు చేయడం ఇప్పటికీ సాధ్యం కాలేదన్నారు. అందువల్ల అవయవదాతలు, వారి కుటుంబాల ఔదార్యం ఎంతో విలువైనదని పేర్కొన్నారు. అవయవ మార్పిడిలో ప్రధాన సవాళ్లను వివరిస్తూ.. మార్పిడి చేసిన అవయవాన్ని శరీర రోగనిరోధక వ్యవస్థ పరాయిదిగా గుర్తించి తిరస్కరించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ ప్రతిస్పందనను నియంత్రించేందుకు ఆధునిక వైద్య విధానాలు, ఔషధాలు అందుబాటులోకి వచ్చినప్పటికీ, అవయవ తిరస్కరణను నివారించడంతో పాటు గ్రహీతను ఇన్ఫెక్షన్ల నుంచి రక్షించడం మధ్య సమతుల్యత పాటించడం కీలకమన్నారు. అవయవ మార్పిడి విజయవంతం కావడానికి అవయవాల లభ్యత అత్యంత కీలకమని డాక్టర్ భూషణ్ రాజు అన్నారు. దేశంలో అవయవ మార్పిడి కోసం ఎదురుచూస్తున్న వారి సంఖ్యకు, అందుబాటులో ఉన్న అవయవాలకు మధ్య గణనీయమైన అంతరం ఉందన్నారు. ఈ అంతరాన్ని తగ్గించాలంటే ప్రజల్లో అవయవదానంపై అవగాహన పెంచడంతో పాటు కుటుంబ స్థాయిలోనూ చర్చలు జరగాలని సూచించారు. అవయవదానంపై ఉన్న అపోహలు, తప్పుడు అభిప్రాయాలను తొలగించడంలో మీడియా కీలక పాత్ర పోషించగలదన్నారు. అవయవదానం కేవలం వైద్యపరమైన అంశం మాత్రమే కాదని, కుటుంబం, సమాజంతో ముడిపడిన సామాజిక అంశమని పేర్కొన్నారు. అవయవదానానికి కుటుంబ సభ్యులు సిద్ధంగా ఉన్నప్పటికీ దాత, గ్రహీతల మధ్య వైద్యపరమైన అనుకూలత లేకపోతే స్వాప్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఒక ముఖ్యమైన ప్రత్యామ్నాయంగా ఉంటుందని డాక్టర్ భూషణ్ రాజు వివరించారు. తగిన చట్టపరమైన, వైద్య నిబంధనలకు అనుగుణంగా పరస్పరం అనుకూలమైన దాత-గ్రహీత జంటలను గుర్తించి అవయవ మార్పిడి చేయవచ్చన్నారు. దేశంలో అవయవదానం, మార్పిడి వ్యవస్థను బలోపేతం చేయడంలో జాతీయ, రాష్ట్ర స్థాయి అవయవ--కణజాల మార్పిడి సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. పారదర్శక అవయవ కేటాయింపు వ్యవస్థ, అవగాహన కార్యక్రమాలు, ప్రచారాల ద్వారా అవయవదానాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. పీఐబీ హైదరాబాద్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మానస్ కృష్ణకాంత్ మాట్లాడుతూ.. దేశంలో అవయవ మార్పిడికి ఉన్న డిమాండ్, దాతల ద్వారా లభించే అవయవాల మధ్య గణనీయమైన వ్యత్యాసం ఉందన్నారు. అవయవదానం, మార్పిడి ప్రక్రియలను సమన్వయం చేయడంతో పాటు ప్రజల్లో అవగాహన కల్పించడంలో సంబంధిత సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. మీడియా కార్యశాలల ద్వారా అవయవదానంపై ఉన్న అపోహలను తొలగించి, ప్రజలకు వైద్యపరమైన వాస్తవాలను అందించడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొని అవయవదానానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. ప్రజల్లో అవయవదానంపై మరింత అవగాహన కల్పించేందుకు విస్తృతంగా సమాచార కార్యక్రమాలు నిర్వహించాలని సమావేశం పిలుపునిచ్చింది. అవయవదానంపై అవగాహన, కుటుంబ చర్చలు, స్వచ్ఛంద సమ్మతి పెంచేందుకు జాతీయ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పీఐబీ తెలిపింది.

# ఓటుకు నోటు కేసు మళ్లీ మొదటికి!

**విచారణ ఫస్ట్ నుంచి మొదలెట్టాల్సిందే**

**రిటైర్డ్ జడ్జీల విన్న వాదనలు ఇప్పుడు పనికిరావు**

**సీజేఐ సూర్యకాంత్ స్పష్టీకరణ**



న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఓటుకు నోటు కేసు విచారణ సుప్రీంకోర్టులో మరోసారి కీలక మలుపు తిరిగింది. తుది విచారణలో వాదనలు విన్న ధర్మాసనంలోని న్యాయమూర్తులు పదవీ విరమణ చేయడంతో, కేసును కొత్త ధర్మాసనం మొదటి నుంచి విచారించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పాత ధర్మాసనం విన్న వాదనలను కొత్త బెంచ్ నేరుగా పరిగణనలోకి తీసుకునే అవకాశం లేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేసినట్లు కథనం పేర్కొంది. పార్ట్-హెర్డ్ మ్యాటర్‌గా గురువారం ఈ కేసుకు సంబంధించిన పిటిషన్లు సీజేఐ ధర్మాసనం ముందుకు వచ్చాయి. కేసును కొత్త బెంచ్ విచారించాల్సి ఉండటంతో పూర్తి స్థాయి వాదనలు మరోసారి వినాల్సి ఉంటుందని కోర్టు తెలిపింది. దీంతో విచారణను వాయిదా వేసింది. ఈ కేసులో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌తో పాటు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత సండ్ర వెంకట వీరయ్య పిటిషన్ కూడా కీలకంగా మారింది. ఓటుకు నోటు కేసును అవినీతి నిరోధక చట్టం కింద కాకుండా ఎన్నికల చట్టాల ప్రకారం విచారించాలని రేవంత్‌రెడ్డి తన పిటిషన్‌లో కోరినట్లు కథనం పేర్కొంది. మరోవైపు తనపై నమోదైన కేసులో ఆరోపణలకు తగిన ఆధారాలు లేవని, కేసు నుంచి తన పేరును తొలగించాలని సండ్ర వెంకట వీరయ్య సుప్రీంకోర్టును కోరినట్లు తెలిపింది. ఈ రెండు పిటిషన్లను కలిపి విచారించనున్నారు. 2015 మే 31న శాసన మండలి ఎన్నికల నేపథ్యంలో అప్పటి టీడీపీ నేత రేవంత్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థి వేమ్ నరేందర్‌రెడ్డికి మద్దతు కోరుతూ నామినేటెడ్ ఎమ్మెల్యే ఎల్విస్ స్టీఫెన్సన్‌కు రూ.50 లక్షలు లంచంగా ఇస్తున్నారనే ఆరోపణలపై ఏసీబీకి పట్టుబడ్డారని కథనం పేర్కొంది. అనంతరం 2015 జూలైలో రేవంత్‌రెడ్డి తదితరులపై అవినీతి నిరోధక చట్టం, ఐపీసీ సెక్షన్ 120బి కింద ఏసీబీ ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఆడియో, వీడియో రికార్డింగులతో పాటు రూ.50 లక్షల అడ్వాన్స్ మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నామని ఏసీబీ అప్పట్లో పేర్కొంది. కొత్త ధర్మాసనం ముందు కేసు మళ్లీ మొదటి నుంచి విచారణకు రానుండటంతో తదుపరి దశలో సుప్రీంకోర్టు తీసుకునే నిర్ణయాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్, సండ్ర వెంకట వీరయ్య పిటిషన్‌పై కోర్టు వైఖరి కేసు భవిష్యత్ దిశను నిర్ణయించే అవకాశం ఉంది.

# కిడ్స్ కాన్వెంట్‌లో ఘనంగా విద్యార్థి మండలి ఎన్నికలు

**ఎన్నికల సందడితో కిడ్స్ కాన్వెంట్ క్యాంపస్**

**ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ లక్షణాలే లక్ష్యం**

**స్కూల్ ప్రిన్సిపాల్ ధరక్షన్ వసూపియా**



వేములవాడ అర్బన్, ఆగస్టు 13 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో కిడ్స్ కాన్వెంట్ హైస్కూల్‌లో విద్యార్థి మండలి ఎన్నికలను ఘనంగా నిర్వహించారు. సాధారణ ఎన్నికల తరహాలో ఓటింగ్ ప్రక్రియ చేపట్టి విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుత భావనను పెంపొందించేలా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా విద్యార్థి అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం నిర్వహించడంతో పాఠశాల ప్రాంగణంలో సందడి నెలకొంది. విద్యార్థులు ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొని తమకు నచ్చిన అభ్యర్థులకు ఓటు వేశారు. అనంతరం ఓట్ల లెక్కింపు చేపట్టి వివిధ పదవులకు విజేతలను ఎంపిక చేశారు. హెడ్ బాయ్ (కెప్టెన్)గా ఎస్. ఆదిత్య, హెడ్ గర్ల్ (కెప్టెన్)గా వి. వైష్ణవి, వైస్ కెప్టెన్ బాయ్‌గా సీహెచ్. రితేష్ కుమార్, వైస్ కెప్టెన్ గర్ల్‌గా పీ. మనశ్విని, హౌస్ కెప్టెన్‌గా కే. అవంతిక, సోషల్ క్లబ్ లీడ్‌గా ఎన్. రిషిక, కల్చరల్ క్లబ్ లీడ్‌గా ఏ. హారిణి, స్పోర్ట్స్ క్లబ్ లీడ్‌గా ఎల్. విక్టర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ధరక్షన్ వసూపియా మాట్లాడుతూ.. విద్యార్థులకు చిన్ననాటి నుంచే ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో విద్యార్థి మండలి ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ప్రత్యక్షంగా పాల్గొనడం ద్వారా నాయకత్వ లక్షణాలు, బాధ్యత, నిర్ణయ సామర్థ్యం, సమన్వయ భావన పెంపొందుతాయని పేర్కొన్నారు. విద్యార్థులను కేవలం విద్యకే పరిమితం చేయకుండా భవిష్యత్తులో బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని ప్రిన్సిపాల్ తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల సహకారంతో ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు.

# కూకట్‌పల్లిలో అభివృద్ధికి కొత్త శకం: బండి రమేష్

కూకట్‌పల్లి, ఆగస్టు 13 (ఈవార్తలు): కూకట్‌పల్లి నియోజకవర్గంలోని కె.పి.హెచ్.బీ ప్రజయ్ అపార్ట్‌మెంట్స్ రోడ్, గోకుల్ ప్లాట్స్ వద్ద ప్రతిష్ఠాత్మక ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ముఖ్యమంత్రి పర్యటనతో కూకట్‌పల్లి నియోజకవర్గంలో అభివృద్ధికి కొత్త శకం ప్రారంభమైందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే గాంధీ, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, బండి రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. పేదలు, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. హైదరాబాద్‌లో మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన జీవన ప్రమాణాలు కల్పించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో గృహ నిర్మాణ రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఇందిరమ్మ టవర్స్ వంటి నిర్మాణాల ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు మెరుగైన నివాస సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమన్నారు. బండి రమేష్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కూకట్‌పల్లి నియోజకవర్గం అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతోందన్నారు. ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం కూకట్‌పల్లి ప్రజలకు సంతోషకరమైన విషయమని తెలిపారు. పేదలు, మధ్యతరగతి కుటుంబాలకు మెరుగైన గృహ వసతి కల్పించడంతో పాటు నియోజకవర్గంలో మౌలిక వసతులను అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తామని చెప్పారు. కూకట్‌పల్లి నియోజకవర్గ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా కూకట్‌పల్లిని మరింత అభివృద్ధి చెందిన నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని బండి రమేష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, బ్లాక్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# "బన్సీలాల్ పేట్‌లో హర్ ఘర్ తిరంగా" యాత్ర

పద్మారావు నగర్, ఆగస్టు 13 : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమంలో భాగంగా బన్సీ లాల్ పేట్ డివిజన్‌లో భారీ తిరంగా యాత్ర నిర్వహించారు. న్యూ బోయిగూడలోని ఐడిహెచ్ డబుల్ బెడ్ రూమ్ కాలనీ నుండి బయలుదేరిన ర్యాలీ చాచా నెహ్రూ నగర్ వరకు కొనసాగింది. వందలాదిమంది విద్యార్థులు చేతిలో జాతీయ జెండాను పట్టుకుని వందేమాతరం, భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీలో నడిచారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు టి. రాజశేఖర్ రెడ్డి, వై. సురేష్ కుమార్, గడ్డం నవీన్, సత్యనారాయణ గౌడ్, రామంచ మహేష్, బంధం కిరణ్, ఎ.శ్రీనివాస్, ఎస్. రాజు,శివరామకృష్ణ కే.ఎం. కృష్ణ, కే. కృష్ణ, వై. శ్రీనివాస్ ముదిరాజ్, బి. పరమేష్, వెంకటపతి రాజు, శ్రీకాంత్, రఘురాం, గణేష్ సిల్వరాజ్, అరుణ్, కిరీట, సుచరిత, హిమబిందు పాల్గొన్నారు.



# జగిత్యాలలో ఘనంగా తిరంగా ర్యాలీ

జగిత్యాల, ఆగస్టు 13 (ఈవార్తలు): భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జగిత్యాలలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. బీజేపీ జగిత్యాల జిల్లా ఆధ్వర్యంలో గురువారం టౌన్‌హాల్ నుంచి పాత బస్టాండ్ వరకు ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు జాతీయ జెండాలను చేతబూని ర్యాలీలో పాల్గొన్నారు. 'భారత్ మాతాకీ జై' నినాదాలతో పట్టణంలోని పురవీధులు మార్మోగాయి. దేశభక్తి గీతాల నడుమ ర్యాలీ ఉత్సాహభరితంగా సాగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగరాలన్నదే ప్రధాని మోదీ ఆకాంక్ష అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను యువత స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. దేశభక్తి భావాన్ని భావితరాలకు అందించడమే హర్ ఘర్ తిరంగా కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. జాతీయ జెండా గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇంచార్జి డా. భోగ శ్రావణి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.


# సర్‌పై పూర్తి వివరాలు అందించడి

**కలెక్టర్‌కు గాజంగి నందయ్య వినతి**

జగిత్యాల, ఆగస్టు 13 (ఈవార్తలు): పీసీసీ ఆదేశాల మేరకు ఎస్ఐఆర్ ( ఎస్ ఐ ఆర్) కు సంబంధించిన జగిత్యాల జిల్లా పూర్తి వివరాలను వెల్లడించాలని కోరుతూ జగిత్యాల జిల్లా కలెక్టర్‌కు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజంగి నందయ్య వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నందయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో, ముఖ్యంగా జగిత్యాల జిల్లాలో జరుగుతున్న ఓటరు నమోదు ప్రక్రియకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని వెల్లడించాలని కోరారు. జిల్లాలో ఇప్పటివరకు ఎంతమంది ఓటర్లు నమోదయ్యారు, ఓటరు నమోదు ప్రక్రియ ఎంత శాతం పూర్తయింది తదితర వివరాలను పూర్తిస్థాయిలో ప్రజలకు తెలియజేయాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి బోగోజి ముకేష్ ఖన్నా పాల్గొన్నారు.

# రూ.30 వేలకు 'పట్టా' బేరం

**ఏసీబీకి చిక్కిన బీర్పూర్ ఆర్ఐ**



బీర్పూర్, ఆగస్టు 13 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా బీర్పూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న రాహుల్ రూ.30 వేల లంచం తీసుకుంటూ గురువారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ గట్ల మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సిరిపూర్‌కు చెందిన ఓ మహిళ 12 గుంటల భూమిని సాదాబైనామా ద్వారా కొనుగోలు చేసి, భూభారతిలో పట్టా చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని తహసీల్దార్ ఆర్ఐ రాహుల్‌ను ఆదేశించారు. అయితే విచారణ, నివేదిక కోసం రాహుల్ రూ.30 వేలు లంచం డిమాండ్ చేయడంతో బాధితురాలు ఏసీబీని ఆశ్రయించారు. గురువారం బాధితురాలి నివాసం వద్ద ఆమె నుంచి రూ.30 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రాహుల్‌ను పట్టుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ప్రభుత్వ అధికారులు లంచం డిమాండ్ చేస్తే నిర్భయంగా ఏసీబీని ఆశ్రయించాలని ఆయన కోరారు.



# ధర్మపురి క్షేత్రం రూపురేఖలు మారుస్తాం

**కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు: మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్**

ధర్మపురి, ఆగస్టు 13 (ఈవార్తలు): ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ధర్మపురి క్షేత్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. గురువారం ధర్మపురిలో అంబేద్కర్ భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా భవనాన్ని నిర్మిస్తున్నామని, గ్రౌండ్ ఫ్లోర్‌లో షాపింగ్ కాంప్లెక్స్, పై అంతస్తుల్లో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. గోదావరి పుష్కరాలను కుంభమేళా తరహాలో నిర్వహిస్తామని మంత్రి తెలిపారు. పుష్కరాల కోసం ప్రభుత్వం రూ.117 కోట్లు కేటాయించగా ధర్మపురిలో రూ.37 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. లక్షలాది మంది భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తామన్నారు. టీయూఎఫ్ఐడీసీ, అమృత్ పథకాల ద్వారా అదనపు నిధులు సాధించి అభివృద్ధి పనులు కొనసాగిస్తామని పేర్కొన్నారు.



# వేములవాడ బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా తిరంగా ర్యాలీ

వేములవాడ అర్బన్, ఆగస్టు 13 (ఈవార్తలు): వేములవాడ పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. పట్టణ బీజేపీ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ ఆధ్వర్యంలో తిప్పాపురం హనుమాన్ ఆలయం నుంచి బస్‌స్టేషన్ వరకు ర్యాలీ కొనసాగింది. జాతీయ జెండాలను చేతబూనిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు దేశభక్తి నినాదాలతో ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాపల్లి శ్రీధర్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతి భారతీయుడిలో దేశభక్తి భావాన్ని మరింత పెంపొందించేందుకు ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ జెండాకు గౌరవం చాటాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా ప్రతాప రామకృష్ణతో కలిసి పలు పాఠశాలల విద్యార్థులకు జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ.. ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం లభించిందని అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లింగంపల్లి శంకర్ హాజరయ్యారు. రాష్ట్ర నాయకుడు ఎర్ర మహేష్, కౌన్సిలర్లు మైలారం శ్రీనివాస్, ముత్యం, వంగల శ్రీనివాస్, నాయకులు రేగుల శ్రీకాంత్, మామిండ్ల లక్ష్మీరాజ్యం, పిన్నింటి హనుమాన్లు, గుడిసె మనోజ్, వాసం మల్లేశం, బిల్లా కృష్ణ, హరి, వివేక్‌రెడ్డి, కటకం శ్రీనివాస్, జవ్వాజి శేఖర్, నేరెళ్ల సాయి, కిరణ్, జగన్నాథం శ్రీనివాస్, పొలస రాజేందర్, హరీష్, సాయి కిరణ్, లాలా శేఖర్, పల్లెప లక్ష్మణ్, న్యాత మహేష్, శివ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# ఉచిత పోలీస్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

**జగిత్యాల టౌన్ సీఐ కరుణాకర్**

జగిత్యాల, ఆగస్టు 13 (ఈవార్తలు): వాల్మీకి ఆవాసం సేవా భారతి ఆధ్వర్యంలో అందిస్తున్న ఉచిత పోలీస్ శిక్షణను యువత సద్వినియోగం చేసుకొని పోలీస్ ఉద్యోగం సాధించాలని టౌన్ సీఐ కరుణాకర్ సూచించారు. గురువారం వాల్మీకి ఆవాసంలో ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగం సాధించాలంటే శారీరక దారుఢ్యంతో పాటు విషయ పరిజ్ఞానం, క్రమశిక్షణ, కఠోర శ్రమ అవసరమన్నారు. ఆర్థిక ఇబ్బందులతో కోచింగ్ తీసుకోలేని గ్రామీణ యువతకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగకరమని తెలిపారు. యశస్వి ఎంటర్‌ప్రైజెస్ అధినేత కోటగిరి శ్రీనివాస్, ఆర్ఎస్ఎస్ విభాగ్ సేవా ప్రముఖ్ ఆకు రాజేందర్ మాట్లాడుతూ యువత ప్రణాళికాబద్ధంగా చదివి లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. కార్యక్రమంలో సేవా భారతి జిల్లా అధ్యక్షుడు ఎస్పీ సుబ్రహ్మణ్యం, ఆవాస కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# విద్యా రంగ అభివృద్ధికి ప్రత్యేక దృష్టి

**జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్**

రాయికల్, ఆగస్టు 13 (ఈవార్తలు): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపుతో పాటు మౌలిక వసతుల అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం రాయికల్ మండలం అల్లీపూర్ ప్రభుత్వ పాఠశాలలో రూ.22.50 లక్షలతో చేపట్టనున్న ప్రహరీగోడ, కిచెన్‌షెడ్, మరుగుదొడ్లు, సీసీ రోడ్డు, అంగన్‌వాడీ భవన మరమ్మతు పనులకు శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక వసతులు, నాణ్యమైన ఆహారం, డిజిటల్ సదుపాయాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహారం కూడా అందిస్తున్నామని తెలిపారు. రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని, ఇందులో సుమారు 2,500 మంది విద్యార్థులకు విద్య అందనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం రాయికల్‌లో 57 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.18.60 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు.

## కోడిపందాల స్థావరాలపై పోలీసుల దాడులు

**ఇద్దరు అదుపులో.. ఐదు ద్విచక్ర వాహనాలు, కారు స్వాధీనం**

**మూడు పందెం కోళ్లు, రూ.1,000 నగదు పట్టివేత**

ధర్మపురి, ఆగస్టు 13 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం రాయపట్నం గ్రామంలో కోడిపందాలు నిర్వహిస్తున్న స్థావరంపై పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. పక్కా సమాచారంతో ఎస్సై నాగపురి సధాకర్ సిబ్బందితో కలిసి దాడి చేయగా, పోలీసులను గమనించిన పలువురు పందెం రాయుళ్లు అక్కడి నుంచి పరారైనట్లు తెలిపారు. దాడిలో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని ఎస్సై తెలిపారు. వారి నుంచి ఐదు ద్విచక్ర వాహనాలు, ఒక కారు, మూడు పందెం కోళ్లు, రూ.1,000 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కోడిపందాల నిర్వహణపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సధాకర్ తెలిపారు.



## పంద్రాగస్టు వేడుకలు ఘనంగా నిర్వహించాలి

**ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ**

జగిత్యాల, ఆగస్టు 13 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఆగస్టు 15న నిర్వహించనున్న స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం ఎస్పీ అశోక్‌కుమార్‌తో కలిసి వేడుకల ఏర్పాట్లను పరిశీలించారు. వేదిక, పతాకావిష్కరణ స్థలం, పరేడ్, సాంస్కృతిక కార్యక్రమాలు, స్టాల్స్, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థులు, ఆహ్వానితులు, ప్రజలకు తాగునీరు, వైద్య, పారిశుద్ధ్య సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు, పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## కల్యాణలక్ష్మిపై కౌంటర్ పిటిషన్ ఏది?

**రేవంత్ నిర్లక్ష్యంతో పథకాలు నిలిచిపోయే పరిస్థితి**

**మాజీ మంత్రి జీవన్‌రెడ్డి మండిపాటు**

జగిత్యాల, ఆగస్టు 13 (ఈవార్తలు): వృద్ధులు, మహిళల సంక్షేమం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి టి.జీవన్‌రెడ్డి ఆరోపించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో ఆయన గురువారం కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు చేశారు. వృద్ధుల పోషణను నిర్లక్ష్యం చేస్తే శిక్షించేలా తల్లిదండ్రుల సంరక్షణ చట్టాన్ని రూపొందించిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు అదే చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం వృద్ధులను కన్నబిడ్డల్లా చూసుకోవాల్సి ఉండగా వారి సంక్షేమాన్ని విస్మరిస్తోందన్నారు. అర్హులైన అవ్వలు, తాతలకు పెన్షన్లు ఇవ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. పెన్షన్ల విషయంలో కోర్టులో కనీసం కౌంటర్ పిటిషన్ కూడా దాఖలు చేయలేదని విమర్శించారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల విషయంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని జీవన్‌రెడ్డి మండిపడ్డారు. ప్రభుత్వ వైఖరితో కళ్యాణలక్ష్మి కార్యక్రమం నిలిచిపోయే పరిస్థితి రావడం సిగ్గుచేటన్నారు. కేసీఆర్ హయాంలో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, బీడీ కార్మికుల పెన్షన్ వంటి పథకాలను సమర్థంగా అమలు చేశామని గుర్తుచేశారు. కళ్యాణలక్ష్మి పథకం ద్వారా కేసీఆర్‌ను ప్రతి ఇంటి మేనమామగా ప్రజలు భావించారని అన్నారు. ఎన్నికల సమయంలో మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు అమలు చేయలేదని జీవన్‌రెడ్డి విమర్శించారు. మహిళలను తోబుట్టువులుగా, ఆడబిడ్డలుగా, కన్నతల్లులుగా భావించే ప్రభుత్వం వారి సంక్షేమాన్ని ఎందుకు విస్మరిస్తోందని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి వృద్ధులు, మహిళలు, పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



## 31లోగా పెన్షన్ దరఖాస్తు: అడ్లూరి

జగిత్యాల, ఆగస్టు 13 (ఈవార్తలు): అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ నూతన పెన్షన్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. గురువారం జగిత్యాలలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌తో కలిసి నూతన రేషన్‌కార్డులు, పెన్షన్లపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎన్నో రోజులుగా నూతన పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని మంత్రి తెలిపారు. వితంతువులు, ఒంటరి మహిళలు, ఫైలేరియా, డయాలసిస్, తలసేమియా బాధితులు, దివ్యాంగులు, చేనేత, గీత కార్మికులు తదితర అర్హులైన వర్గాలకు నూతన పెన్షన్లు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. అర్హులైన వారు ఆగస్టు 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, మున్సిపాలిటీల్లో బిల్ కలెక్టర్ల ద్వారా దరఖాస్తులు స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 2,18,002 మంది లబ్ధిదారులకు నెలకు సుమారు రూ.47 కోట్ల మేర పెన్షన్లు అందుతున్నాయని మంత్రి తెలిపారు. ప్రస్తుతం ఉన్న పెన్షన్లకు అదనంగా నూతన పెన్షన్లు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. చేనేత, గీత కార్మికులకు 50 ఏళ్ల వయస్సు నుంచే పెన్షన్ పొందే అవకాశం కల్పిస్తున్నామని, దివ్యాంగులకు 51 శాతం వైకల్యం నిబంధన ప్రకారం పెన్షన్ అందిస్తామని పేర్కొన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి నూతన పెన్షన్ అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సమావేశంలో వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నరసింగరావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనబట్ల దినేష్, అదనపు కలెక్టర్ బి.రాజగౌడ్, డీఆర్‌డీఓ రఘువరన్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## అన్నా.. నీకు పోరాటమన్నది కొత్తగాదే!



### గన్ను వదిలినవ్.. పెన్నుతో పోరాటం చేయ్

**ప్రజల్లో ఉంటూ ప్రజా సంక్షేమం కోసం గళమెత్తు.. జెన్ జీతో, జనంతో కలిసి జంగ్ సైరన్ మోగించు**

(శ్రీశైలం దూడం - సీనియర్ జర్నలిస్టు - 9133947176)

నక్సల్‌బరి ఒకే వర్గం నుంచి పుట్టిన ఉద్యమం కాదు. చదువుకున్న మేధావులు ఉన్నారు. ఉద్యమకారులు ఉన్నారు. అగ్రవర్ణ కుటుంబాల్లో పుట్టినవారు ఉన్నారు. దొరల కుటుంబాల నుంచి వచ్చినవారూ ఉన్నారు. పేదల ఇళ్లలో పుట్టినవారూ ఉన్నారు. కులం, వర్గం, ఆర్థిక స్థాయి దాటి ఏదో ఒక అన్యాయం, ఏదో ఒక ఆవేదన, ఏదో ఒక సామాజిక ప్రశ్న వారిని ఆ దారిలోకి నడిపించింది. తెలంగాణ నేలపై దొరగిరి, వెట్టిచాకిరీ, పెత్తందారీ, అవమానాలు, భూదోపిడీ, మహిళలపై దౌర్జన్యాలు, "అయ్యా.. బాంచన్" అంటూ తలవంచాల్సిన పరిస్థితులు ఒక చారిత్రక ఆవేదనను సృష్టించాయి. ఆ నేపథ్యంలోనే ఆయుధ పోరాటాలకు సామాజిక నేపథ్యం ఏర్పడింది. ఆ మార్గం ఎంత విషాదాన్ని మిగిల్చిందో చరిత్ర చెబుతోంది. ప్రాణాలు పోయాయి. కుటుంబాలు ఛిన్నాభిన్నమయ్యాయి. అడవులు రక్తాన్ని చూశాయి. చివరకు అనేకమంది ఆయుధాలను వదిలి జనజీవన స్రవంతిలోకి వచ్చారు. ఇప్పుడు అసలు ప్రశ్న అక్కడి నుంచే మొదలవుతోంది. గన్ను వదిలిన అన్నా... నువ్వు చూసిన అన్యాయం అంతా పోయిందా? భూకబ్జాలు ఆగిపోయాయా? అధికార దుర్వినియోగం తగ్గిపోయిందా? సెటిల్‌మెంట్ల పేరుతో సామాన్యుడిపై ఒత్తిడి పూర్తిగా మాయమైందా? అవినీతి అంతరించిపోయిందా? పేదవాడి భూమి, రైతు హక్కు, విద్య, వైద్యం, ఉపాధి సమస్యలు పరిష్కారమయ్యాయా? కాదే! అయితే గన్ను వదిలిన తర్వాత గళం ఎందుకు మౌనమైంది? ఒకప్పుడు వ్యవస్థను మార్చాలనే ఆవేశంతో అడవిబాట పట్టినవారికి ఇప్పుడు ఒక అద్భుతమైన అవకాశం ఉంది. అది డిజిటల్ యుగం. అడవుల్లో సమాచారం చేరడానికి రోజులు పట్టిన కాలం పోయింది. ఇప్పుడు ఒక ఫోన్ ద్వారా ఒక గ్రామ సమస్య దేశం దృష్టికి వెళ్లగలదు. ఒక వీడియోతో ఒక అన్యాయం వెలుగులోకి రావచ్చు. ఒక పత్రంతో ఒక అవినీతి వ్యవహారం ప్రశ్నించవచ్చు. ఒక ప్రజా సమావేశంతో వందల మందికి రాజ్యాంగ హక్కులు తెలియజేయవచ్చు. అంటే కొత్త ఆయుధం లేదా? ఉంది. పెన్ను ఉంది. మొబైల్ ఉంది. రాజ్యాంగం ఉంది. ప్రజల ఓటు ఉంది. ప్రజా చైతన్యం ఉంది. ఇవి తుపాకీ కంటే బలహీనమైనవని ఎవరు చెప్పారు? ఒకప్పుడు తుపాకీ శబ్దం ఒక ప్రాంతాన్ని కదిలించి ఉండవచ్చు. కానీ నేడు ఒక చైతన్యవంతమైన ఓటరు లక్షల కోట్ల రూపాయల ప్రభుత్వ విధానాలను మార్చగలడు. ఒక ప్రశ్న అధికారిని సమాధానం చెప్పేలా చేయగలదు. ఒక ప్రజా ఉద్యమం చట్టాన్ని మార్చే స్థాయికి వెళ్లగలదు.

అందుకే నేటి పోరాటం తుపాకీతో కాదు.. సమాచారంతో. భయంతో కాదు.. అవగాహనతో. హింసతో కాదు.. ఓటుతో. జెన్ జీతో కలిసి కొత్త పోరాటం. నేటి జెన్ జీకి తుపాకీ కథలు అవసరం లేదు. వారికి దిశ కావాలి. విద్య ఎలా మెరుగుపడాలి? ప్రభుత్వ పాఠశాలలు ఎందుకు బలపడాలి? పేదవాడికి నాణ్యమైన వైద్యం ఎలా అందాలి? రైతుకు గిట్టుబాటు ధర ఎలా రావాలి? యువతకు ఉద్యోగాలు ఎలా రావాలి? ప్రభుత్వ పథకాలు నిజమైన లబ్ధిదారులకు ఎలా చేరాలి? అవినీతిని ఎలా ప్రశ్నించాలి? భూకబ్జాకు గురైన వ్యక్తి చట్టపరంగా ఎక్కడికి వెళ్లాలి? ప్రజాప్రతినిధిని ఎలా జవాబుదారీగా నిలబెట్టాలి? ఇవి నేటి అసలు పోరాటాలు. ఇలాంటి విషయాల్లో అనుభవజ్ఞులైన మాజీ ఉద్యమకారులు యువతకు మార్గదర్శకులుగా నిలిస్తే.. అది చరిత్రకు ఒక కొత్త మలుపు. అడవిలో ఉన్నప్పుడు ప్రజలను చైతన్యపరిచిన అనుభవం.. ఇప్పుడు ప్రజాస్వామ్యంలో యువతను చైతన్యపరిచే శక్తిగా మారాలి. ఒకప్పుడు గ్రామంలోకి వెళ్లి సమస్యను వినేవారు. ఇప్పుడు గ్రామంలోకి వెళ్లి సమస్యను వినడమే కాదు.. దానికి రాజ్యాంగబద్ధమైన పరిష్కార మార్గం కూడా చూపాలి. ఉచిత హామీ కాదు.. భవిష్యత్తు కోసం ఓటు. ప్రజా చైతన్యం అంటే ఒక పార్టీకి మద్దతు ఇవ్వడం కాదు. ఒక నాయకుడిని వ్యతిరేకించడం కూడా కాదు. ఎవరైనా సరే.. ప్రశ్నించాలి. "నాకు ఉచితంగా ఏమిస్తారు?" అనే ప్రశ్నతో పాటు.. "నా పిల్లలకు నాణ్యమైన విద్య ఎలా ఇస్తారు?" "నా కుటుంబానికి మంచి వైద్యం ఎలా అందుతుంది?" "రైతుకు స్థిరమైన ఆదాయం ఎలా కల్పిస్తారు?" "యువతకు ఉద్యోగాలు ఎక్కడి నుంచి వస్తాయి?" "ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు ఎందుకు బలోపేతం కావు?" "నా గ్రామానికి వచ్చిన నిధులు ఎలా ఖర్చయ్యాయి?" "మీరు ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేశారు?" అని అడగాలి. ఓటు అనేది కేవలం ఉచిత వస్తువుల కోసం ఇచ్చే కాగితం కాదు. ఐదేళ్ల పాలనకు ఇచ్చే ప్రజా అనుమతి.

ఆ విషయాన్ని ప్రజలకు చెప్పగలిగితే.. అదే అసలైన ప్రజా ఉద్యమం. అన్నల అనుభవం.. కొత్త తరానికి దిశ. ఒకప్పుడు గన్ను పట్టిన చేతులు ఇప్పుడు కలం పట్టాలి. ఒకప్పుడు అడవిలో నడిచిన కాళ్లు ఇప్పుడు గ్రామాల్లో నడవాలి. ఒకప్పుడు రహస్య సమావేశాలు నిర్వహించిన వారు ఇప్పుడు బహిరంగ ప్రజా చర్చలు నిర్వహించాలి. అవినీతిని ప్రశ్నించాలి. అక్రమాలను ఆధారాలతో బయటపెట్టాలి. బాధితులకు చట్టపరమైన మార్గం చూపాలి. యువతకు రాజ్యాంగ విలువలు నేర్పాలి. ప్రజలకు తమ ఓటు విలువ తెలియజేయాలి. అప్పుడు ఒకప్పుడు తుపాకీకి భయపడిన దోపిడీదారుడికి ఇప్పుడు ప్రజల చైతన్యానికి భయపడే పరిస్థితి రావచ్చు. అది హింసతో వచ్చే భయం కాదు. చట్టం అమలవుతుందనే భయం. ప్రజలు ప్రశ్నిస్తారనే భయం. నిజం బయటపడుతుందనే భయం. ఇదే ప్రజాస్వామ్య శక్తి. అందుకే అడవుల్లో గడిపిన సంవత్సరాలు ముగిసిపోయిన అధ్యాయం కావాల్సిన అవసరం లేదు. అవి ఒక అనుభవం. ఆ అనుభవాన్ని ఇప్పుడు సమాజ నిర్మాణానికి ఉపయోగించవచ్చు.

**నీ ముందే జెన్ జీ ఉంది.**

**నీ చేతిలో రాజ్యాంగం ఉంది.**

**నీ పక్కన ప్రజలు ఉన్నారు.**

**నీ ముందున్నది డిజిటల్ ప్రపంచం.**

**మరి ఎందుకు ఆలస్యం?**

**తుపాకీ వదిలావు.. మంచిదే.**

**ప్రజలతో కలిసి ప్రశ్నించు..**

**చైతన్యం కల్పించు..**

### ఓటు విలువ నేర్పు..

జెన్ జీతో కలిసి కొత్త పోరాటం చేయ్. అడవిలో చేసిన పోరాటం ఎంత దూరం వెళ్లిందో చరిత్ర చెబుతుంది. కానీ ప్రజల మధ్య నిలబడి రాజ్యాంగబద్ధంగా చేసే పోరాటం ఎంత మార్పు తీసుకురాగలదో.. అది నీ చేతుల్లోనే ఉంది అన్నా.

## బంగ్లాదేశ్‌లో కరెంట్ కష్టాలు

**భారత్ సహకారం కోరిన ఢాకా**



ఢాకా: పొరుగు దేశమైన బంగ్లాదేశ్ ప్రస్తుతం తీవ్ర విద్యుత్ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. దేశవ్యాప్తంగా, ముఖ్యంగా రాజధాని ఢాకా మినహా ఇతర గ్రామీణ ప్రాంతాల్లో రోజుకు 9 నుంచి 10 గంటల పాటు విద్యుత్ కోతలు అమలవుతున్నాయి. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. విద్యుత్ పొదుపులో భాగంగా రాత్రి ఎనిమిది గంటలకే షాపింగ్ మాల్స్, దుకాణాలు, మార్కెట్లు మూసివేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఇంధన కొరతను అధిగమించేందుకు అదనపు డీజిల్ సరఫరా చేయాలని భారత్‌ను అభ్యర్థించింది. దేశంలో విద్యుత్ డిమాండ్ 18,000 మెగావాట్లకు చేరగా, సరఫరా మాత్రం 13,000 మెగావాట్లకే పరిమితమైంది. సహజవాయువు కొరత కారణంగా సుమారు 1,500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. గత నెలలో ఒక టెర్మినల్‌లో సంభవించిన అగ్నిప్రమాదం వల్ల ఎల్ఎన్‌జీ సరఫరాకు తీవ్ర అంతరాయం కలగడం ఈ సంక్షోభానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. దీనికి తోడు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల రెండు ఎల్ఎన్‌జీ నౌకలు కూడా సరుకును అన్‌లోడ్ చేయలేకపోయాయి. మైమెన్‌సింగ్, బరిశాల్, రంగ్‌పూర్, సిల్హెట్ వంటి ప్రాంతాల్లో విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల ఆగ్రహానికి గురైన స్థానికులు విద్యుత్ కార్యాలయాలపై దాడులకు పాల్పడిన ఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. ఈ సంక్షోభం పరిశ్రమలు, రైతులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా రొయ్యల సాగులో ఏరేటర్లు పనిచేయకపోవడంతో రైతులు భారీగా నష్టపోతుండగా, వస్త్ర పరిశ్రమ ఉత్పత్తికి కూడా తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో, ఇండియా-బంగ్లాదేశ్ ఫ్రెండ్‌షిప్ పైప్‌లైన్ ద్వారా అదనపు డీజిల్ పంపాలని బంగ్లాదేశ్ ఇంధన శాఖ మంత్రి ఇక్బాల్ హసన్ మహమూద్ భారత హైకమిషనర్‌ను కోరారు. ప్రస్తుతం ఉన్న ఒప్పందం ప్రకారం భారత్ ఏటా 1,80,000 మెట్రిక్ టన్నుల డీజిల్‌ను బంగ్లాదేశ్‌కు సరఫరా చేస్తోంది. అయితే, దిగుమతి చేసుకునే ఇంధనంపైనే అధికంగా ఆధారపడటం వల్ల తక్షణమే ఉపశమనం లభించే అవకాశాలు పరిమితంగానే ఉన్నాయని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

## మా సార్ మాకే కావాలి

**రోడ్డెక్కిన విద్యార్థులు**

**వెనక్కి తగ్గిన జార్ఖండ్ ప్రభుత్వం**

**హెడ్ మాస్టర్ బదిలీపై విద్యార్థుల ఆందోళన**

**3 రోజులుగా ప్రధాన రహదారి దిగ్బంధం**

**దిగివచ్చిన అధికారులు, బదిలీ ఉత్తర్వులు రద్దు**

రాంచీ: జార్ఖండ్లో తమ అభిమాన హెడ్ మాస్టర్‌ను బదిలీని నిరసిస్తూ విద్యార్థులు చేపట్టిన ఆందోళన ఫలించింది. విద్యార్థుల పట్టుదల ముందు అధికారులు తలొగ్గక తప్పలేదు. మూడు రోజుల పాటు ఉద్ధృతంగా సాగిన నిరసనల నేపథ్యంలో ప్రభుత్వం బదిలీ ఉత్తర్వులను ఉపసంహరించుకుంది. గఢ్వా జిల్లా కండి బ్లాక్‌లోని ప్రభుత్వ ప్లస్ టూ ఉన్నత పాఠశాల హెడ్ మాస్టర్ మలయ్ కుమార్ సింగ్‌ను అధికారులు ఇటీవల బదిలీ చేశారు. ఆయన హయాంలో పాఠశాల గణనీయమైన అభివృద్ధి సాధించిందని భావించిన విద్యార్థులు, ఈ బదిలీని తీవ్రంగా వ్యతిరేకించారు. పలువురు విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని కండి-భవనాథ్‌పూర్ ప్రధాన రహదారిపై బైఠాయించారు. "మా సార్ మాకే కావాలి" అంటూ నినాదాలు చేస్తూ గంటల తరబడి ట్రాఫిక్‌ను స్తంభింపజేశారు. గురువారం నాడు ఆందోళన మరింత తీవ్రరూపం దాల్చింది. ఆందోళన చేస్తున్న విద్యార్థులకు నచ్చజెప్పేందుకు వచ్చిన కండి బ్లాక్ చీఫ్ సత్యేంద్ర పాండే, ఒక విద్యార్థిపై చేయి చేసుకున్నట్లు ఆరోపణలు రావడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో ఆగ్రహానికి గురైన విద్యార్థులు ఆయన వాహనంపై దాడి చేశారు. రక్షణ కోసం ఆయన సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఆశ్రయం పొందగా, కొందరు విద్యార్థులు స్టేషన్‌పైకి రాళ్లు రువ్వారు. ఈ ఘటనలో ఒక పోలీసు అధికారి తలకు గాయమైంది. పరిస్థితి తీవ్రతను గమనించిన ఉన్నతాధికారులు రంగంలోకి దిగి విద్యార్థులతో చర్చలు జరిపారు. వారి డిమాండ్‌కు అంగీకరిస్తూ ప్రధానోపాధ్యాయుడు మలయ్ సింగ్ బదిలీని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం విద్యార్థులతో ఫోన్‌లో ఆయనను మాట్లాడించడంతో వారు శాంతించి, తమ ఆందోళనను విరమించారు.

## ఈసీ అబద్ధాలు ఆపు

బెంగళూరు: ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్, కర్ణాటక ఎన్నికల అధికారుల మధ్య ఓటు హక్కు నమోదు విషయంలో మాటల యుద్ధం కొనసాగుతోంది. బెంగళూరు ఓటర్ల జాబితా నుంచి తన పేరును తొలగించారని ప్రకాశ్ రాజ్ ఆరోపించగా, అధికారులు దానిని ఖండించారు. తాజాగా, అధికారులు ఇచ్చిన వివరణపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ గురువారం మరో వీడియోను విడుదల చేశారు. అధికారులది పచ్చి అబద్ధమని, నాటకమాడుతున్నారని ఆయన ఆరోపించారు. వివరాల్లోకి వెళితే.. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా బెంగళూరు సెంట్రల్ నియోజకవర్గ జాబితా నుంచి తన పేరును తొలగించారని ప్రకాశ్ రాజ్ ఇటీవల ఒక వీడియోలో ఆరోపించారు. తాను పుట్టి పెరిగిన, చదువుకున్న, 2019లో ఎంపీగా పోటీ చేసిన చోటే తన ఓటు గల్లంతు కావడం ఏమిటని ప్రశ్నించారు. ఈ ప్రక్రియలో బెంగళూరులో సుమారు 65 లక్షల మంది ఓటర్లు ప్రభావితమయ్యారని కూడా ఆయన పేర్కొన్నారు. ప్రకాశ్ రాజ్ ఆరోపణలపై బెంగళూరు నగర పాలక సంస్థ, ఎన్నికల అధికారులు స్పందించారు. ఆయన పేరును తొలగించలేదని, కేవలం "నివాసం మారారు" అని మాత్రమే జాబితాలో గుర్తించామని స్పష్టం చేశారు. ఆయన నమోదు చేసుకున్న విఠల్ మాల్యా రోడ్డులోని అపార్ట్‌మెంట్‌లో దాదాపు నాలుగేళ్లుగా నివసించడం లేదని బూత్ స్థాయి అధికారి విచారణలో తేలిందని తెలిపారు. చుట్టుపక్కల వారు, భవన యజమాని కూడా ఇదే విషయాన్ని ధృవీకరించారని, ఈ మేరకు తనిఖీ కూడా నిర్వహించామని వివరించారు. తాను వేరే చోట నివసిస్తున్నట్లు ప్రకాశ్ రాజ్ సైతం ఫోన్‌లో అంగీకరించారని అధికారులు తెలిపారు. ఫారం 6 ద్వారా కొత్త చిరునామాను నమోదు చేసుకోవాలని సూచించారు. అయితే, అధికారుల వివరణను ప్రకాశ్ రాజ్ పూర్తిగా తోసిపుచ్చారు. తొలుత పొరపాటు జరిగిందని అంగీకరించి, సరిచేస్తామని చెప్పిన అధికారులే.. ఇప్పుడు మాట మార్చి నాటకాలాడుతున్నారని మండిపడ్డారు.

## పైలట్లకు డ్రగ్స్ టెస్టులు తప్పనిసరి

**పైలట్ గంజాయి వాడకం వివాదం.. ఎయిరిండియా కీలక నిర్ణయం**

న్యూఢిల్లీ: ఫుకెట్-ఢిల్లీ విమాన ఘటనలో పైలట్ గంజాయి సేవించినట్లు నిర్ధారణ కావడంతో టాటా గ్రూప్‌నకు చెందిన ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ కీలక నిర్ణయం తీసుకున్నాయి. తమ సంస్థలో పనిచేస్తున్న పైలట్లందరికీ తప్పనిసరిగా సైకోయాక్టివ్ డ్రగ్స్ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించాయి. ఈ ప్రక్రియ గురువారం (ఆగస్టు 13) నుంచే అమల్లోకి వచ్చిందని సంస్థలు స్పష్టం చేశాయి. ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌లలో కలిపి మొత్తం 5,000 మందికి పైగా పైలట్లు పనిచేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధమైన ఎటువంటి మాదక ద్రవ్యాలు, మత్తుపదార్థాలు వాడలేదని నిర్ధారించుకునేందుకు ఈ పూర్తిస్థాయి స్క్రీనింగ్ చేపడుతున్నట్లు సంస్థలు తమ పైలట్లకు పంపిన అంతర్గత సందేశంలో పేర్కొన్నాయి. గురుగ్రామ్ అకాడమీలో శిక్షణ సమయంలో, విమానం నడిపిన తర్వాత బ్రీఫింగ్ సెంటర్లలో, ఇతర కార్యాలయాల్లో ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రయాణికులు, భాగస్వాములకు భద్రతపై భరోసా కల్పించేందుకే ఈ చర్యలు తీసుకుంటున్నామని ఎయిర్‌లైన్ వర్గాలు వెల్లడించాయి. ఆగస్టు 4న ఫుకెట్ నుంచి ఢిల్లీ వస్తున్న ఎయిరిండియా విమానం గాల్లో తీవ్రమైన కుదుపులకు లోనైన సంగతి తెలిసిందే. ఆ సమయంలో విమానం అకస్మాత్తుగా 300 అడుగుల ఎత్తును కోల్పోవడంతో, సిబ్బంది సహా కనీసం 24 మంది ప్రయాణికులు గాయపడ్డారు. ఈ ఘటన జరిగినప్పుడు విమానంలో 137 మంది ప్రయాణికులు, 8 మంది సిబ్బంది ఉన్నారు. ప్రమాదం అనంతరం నిర్వహించిన వైద్య పరీక్షల్లో పైలట్-ఇన్-కమాండ్ గంజాయి సేవించినట్లు నిర్ధారణ అయింది. దశాబ్దాలుగా సంపాదించుకున్న నమ్మకాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని, అందుకే గ్రూప్‌లోని పైలట్లందరికీ వెంటనే పూర్తిస్థాయి స్క్రీనింగ్ ప్రారంభిస్తున్నామని ఎయిరిండియా ఫ్లైట్ ఆపరేషన్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పైలట్లకు పంపిన సందేశంలో నొక్కిచెప్పారు. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) నిబంధనల ప్రకారం ఇప్పటికే నిర్వహిస్తున్న రాండమ్ పరీక్షలకు ఇది అదనమని సంస్థలు స్పష్టం చేశాయి.

## విదేశాంగం అంటే ఆలింగనాలు కాదు

**మోదీపై రాహుల్ గాంధీ విమర్శలు**


**బీజేపీ, ఆరెస్సెస్‌ను జోకర్ల బృందంగా అభివర్ణన**

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనుసరిస్తున్న విదేశాంగ విధానంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రపంచ దేశాల అధినేతలను ఆలింగనం చేసుకోవడం, వ్యక్తిగత స్నేహాలను ప్రదర్శించడం విదేశాంగ విధానం అనిపించుకోదని, దేశ ప్రయోజనాలను కాపాడటమే అసలైన దౌత్యమని ఆయన స్పష్టం చేశారు. గురువారం ఢిల్లీలో జరిగిన 'రచనాత్మక్ కాంగ్రెస్' జాతీయ సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. విదేశాంగ విధానమంటే విదేశీ నేతలను కౌగిలించుకోవడమన్న ఆలోచన మోదీకి ఎక్కడి నుంచి వచ్చిందో అర్థం కావడం లేదని రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా తన వాదనను వివరించేందుకు వేదికపై ఉన్న రచనాత్మక్ కాంగ్రెస్ చీఫ్ సందీప్ దీక్షిత్‌ను ఆయన ఆలింగనం చేసుకున్నారు. తన నాయనమ్మ, మాజీ ప్రధాని ఇందిరా గాంధీతో కలిసి బాల్యంలో అమెరికా వెళ్లిన సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ, దేశాధినేతల అధికారిక పర్యటనలు వ్యక్తిగత పర్యటనలు వంటివి కావని ఆయన పేర్కొన్నారు. ఇరాన్, అమెరికా, రష్యాలతో భారత్‌కు సుహృద్భావ సంబంధాలు ఉన్నప్పటికీ, ఇరాన్ వివాదంలో మధ్యవర్తిత్వం వహించే అరుదైన అవకాశాన్ని భారత్ కోల్పోయిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని కొన్ని సరిహద్దు ప్రాంతాల్లో భారత సైన్యం పెట్రోలింగ్‌ను చైనా అడ్డుకుంటోందని, గల్వాన్ ఘర్షణల విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరి దేశాన్ని బలహీనపరిచిందని ఆయన విమర్శించారు. బీజేపీ, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్)లను ఒక 'జోకర్ల బృందం'గా అభివర్ణించిన రాహుల్ గాంధీ, ఆ సంస్థలు దేశంపై ఏకపక్ష రాజకీయ వ్యవస్థను రుద్దేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు.

## వయ్యారి చిత్రం



రితికా నాయక్



## వేగం పెంచిన రజనీకాంత్ 'ధర్మన్'

సూపర్ స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా, దర్శకుడు అశ్వత్ మరిముత్తు తెరకెక్కిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ధర్మన్' సినిమా షూటింగ్ వేగం పుంజుకుంది. ఈ చిత్రం రెండో షెడ్యూల్ చిత్రీకరణ నేడు ప్రారంభమైనట్టు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమాను సీనియర్ నటుడు కమల్ హాసన్ తన సొంత నిర్మాణ సంస్థ రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న విషయం తెలిసిందే. షూటింగ్ ప్రారంభంపై చిత్ర నిర్మాణ సంస్థ సోషల్ మీడియా వేదికగా ఒక ప్రత్యేక వీడియో క్లిప్‌ను పంచుకుంది. "ది డెడ్లీ డాక్టర్.. 'ధర్మన్' షెడ్యూల్ 2 మొదలైంది, ఇది ఒక లెజెండరీ" అంటూ పోస్ట్ చేసింది. విడుదల చేసిన వీడియోలో సూపర్ స్టార్ రజనీకాంత్ సెట్స్‌లో ఉండగా, దర్శకుడు అశ్వత్ మరిముత్తు ఆయనతో చర్చిస్తున్న దృశ్యాలు కనిపించాయి. ఈ అప్‌డేట్‌తో అభిమానుల్లో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. ఈ ప్రాజెక్ట్ ప్రకటించినప్పటి నుంచి సినిమాపై భారీ ఆసక్తి నెలకొంది. ఈ ఏడాది జూన్‌లో చిత్ర యూనిట్ ఒక మేకింగ్ వీడియోను విడుదల చేసింది. అందులో సినిమా కోసం రజనీకాంత్ లుక్‌ను ఎలా ఫైనల్ చేశారో చూపించారు. దర్శకుడు అశ్వత్ మరిముత్తు సైతం "ఇదే హెయిర్ స్టైల్, ఇదే లుక్" అంటూ రజనీ కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు. అంతకుముందు "ది ఓజీ స్వాగ్" పేరుతో విడుదలైన మరో వీడియోలో ఫస్ట్ లుక్ కోసం రజనీకాంత్ కాస్ట్యూమ్స్, యాక్సెసరీస్ ఎంపిక చేసే విధానాన్ని, కమల్ హాసన్ కూడా సెట్స్‌కు వచ్చి రజనీతో ముచ్చటించడం వంటి సన్నివేశాలు చూపించారు. ఈ చిత్రంలో రజనీకాంత్ ఒక డాక్టర్‌గా నటిస్తూ, సమాజంలోని నేరస్థులను ఎదుర్కొనే పాత్రలో కనిపించనున్నారు. గతంలో సినిమా టైటిల్ ప్రకటిస్తూ కమల్ హాసన్ "ధర్మమే వెల్లుమ్!" (ధర్మమే గెలుస్తుంది) అని ట్వీట్ చేశారు. విడుదలైన టైటిల్ పోస్టర్‌లో రజనీకాంత్ ఆపరేషన్ థియేటర్‌లో స్కాల్‌పెల్ పట్టుకుని, ఒక రౌడీ షీటర్ శరీరంపై కాలు వేసి నిలబడినట్టుగా కనిపించడం సినిమాపై క్యూరియాసిటీని పెంచింది.

## సినిమాల్లో అతిపెద్ద జెన్ జీ
# నేనే: కమల్ హాసన్


విలక్షణ నటుడు కమల్ హాసన్ సినీ రంగ ప్రవేశం చేసి 67 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ సుదీర్ఘ ప్రయాణంపై ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ ఆసక్తికరమైన విశ్లేషణ చేశారు. దశాబ్దాల అనుభవం ఉన్నప్పటికీ, మారుతున్న చిత్ర పరిశ్రమకు అనుగుణంగా నిరంతరం నేర్చుకుంటూనే ఉంటానని చెబుతూ.. తనను తాను సినిమా రంగంలోని "అత్యంత పెద్ద వయసు జెన్ జీ" గా అభివర్ణించుకున్నారు. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా కమల్ హాసన్ తన అభిప్రాయాలను పంచుకున్నారు. "నా 67 ఏళ్ల సినీ ప్రస్థానానికి శుభాకాంక్షలు తెలిపిన ప్రతి




ఒక్కరికీ ధన్యవాదాలు. ఈ 67 ఏళ్లలో నేను నిజంగా నేర్చుకున్నది కేవలం 20 సంవత్సరాలే అని భావిస్తున్నాను. మిగిలిన సమయం మురుగునీటి ప్రవాహంలో కొట్టుకుపోవడమే. కళాకారులు, ప్రేక్షకులు అందరం కలిసికట్టుగా సినిమా అనే సముద్రంలో కలిసేందుకు ప్రవహిస్తున్నాం. అదొక గొప్ప ఆశ" అని తనదైన తాత్విక ధోరణిలో పేర్కొన్నారు. అంతేకాదు, సినిమా చరిత్రను కూడా ఆయన గుర్తుచేశారు. "1895 డిసెంబర్‌లో లూమియర్ బ్రదర్స్ తొలిసారిగా చిత్రాన్ని ప్రదర్శించారు. అప్పటి నుంచి సినిమా పరిశ్రమకు సుమారు 130 ఏళ్ల చరిత్ర ఉంది. ఈ మొత్తం సినీ చరిత్రలో సగానికి పైగా, అంటే 67 ఏళ్లుగా నేను ఈ రంగంలోనే ఉన్నానని నా బృందం గుర్తు చేసింది. ఇది నమ్మశక్యం కాని ఆలోచన. అయినా నేను నేర్చుకున్నది 20 ఏళ్లే" అని ఆయన తన పోస్టులో వివరించారు.

## ఫోన్ వల్లే సర్జరీ: షకీలా

గంటల తరబడి స్మార్ట్‌ఫోన్‌కు అతుక్కుపోవడం ఎంత ప్రమాదకరమో చెప్పడానికి సీనియర్ నటి షకీలా ఉదంతం ఒక హెచ్చరికగా నిలుస్తోంది. ఫోన్ వ్యసనం కారణంగా తీవ్రమైన నరాల సమస్య బారిన పడిన ఆమె, ఇటీవల మెడకు అత్యవసర శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఈ చేదు అనుభవాన్ని ఆమె స్వయంగా వెల్లడిస్తూ, స్మార్ట్‌ఫోన్ వినియోగదారులను అప్రమత్తం చేశారు. గత కొంతకాలంగా తాను మంచంపై తప్పుడు భంగిమలో పడుకుని గంటల తరబడి ఫోన్‌లో రీల్స్ చూడటం, గేమ్స్ ఆడటమే అలవాటుగా మార్చుకున్నానని షకీలా తెలిపారు. కేవలం టీ, కాఫీ తాగేందుకు మాత్రమే విరామం తీసుకుని, మిగతా సమయమంతా ఫోన్‌తోనే గడిపానని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దురలవాటు కారణంగా మెడలోని ప్రధాన నరాలపై తీవ్ర ఒత్తిడి పడి, సమస్య జఠిలమైందని వివరించారు. చివరికి ఈ అలవాటే తనను ఆపరేషన్ టేబుల్ వరకు తీసుకెళ్లిందని ఆమె వాపోయారు. ఈ మేజర్ సర్జరీ కోసం సుమారు రూ. 3 లక్షలు ఖర్చయిందని, శారీరకంగా తాను భరించలేని నరకాన్ని అనుభవించానని షకీలా కన్నీటిపర్యంతమయ్యారు. ప్రస్తుతం కనీసం మంచం దిగాలన్నా, ఆహారం తినాలన్నా ఇతరుల సహాయం తీసుకోవాల్సిన దీనస్థితిలో ఉన్నానని చెప్పారు. తన అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ గుణపాఠం నేర్చుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె స్మార్ట్‌ఫోన్ వినియోగదారులకు గట్టి హెచ్చరిక జారీ చేశారు. "దయచేసి ఎవరూ ఫోన్‌ను అతిగా వాడి ఆరోగ్యం పాడుచేసుకోవద్దు. స్క్రీన్ టైమ్ తగ్గించుకోండి" అని సూచించారు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలను స్మార్ట్‌ఫోన్లు, ఇతర గాడ్జెట్లకు దూరంగా ఉంచాలని, లేదంటే భవిష్యత్తులో వారు కూడా తీవ్రమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.




## రజనీకాంత్‌తో అలా..!: శ్రియ శరణ్



టాలీవుడ్, కోలీవుడ్ తార నటి శ్రియ శరణ్, సూపర్ స్టార్ రజనీకాంత్‌తో నటించిన 'శివాజీ: ది బాస్' సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. శ్రియ కెరీర్ లోనే అత్యధిక కలెక్షన్స్ సాధించిన చిత్రాలలో ఒకటిగా నిలిచింది. అయితే ఈ సినిమా షూటింగ్ సమయంలో జరిగిన ఒక మధురమైన జ్ఞాపకాన్నిశ్రియ తాజాగా పంచుకున్నారు. దర్శకుడు శంకర్ తనకు ఆ అవకాశం ఇచ్చిన వైనం గురించి ఆమె మాట్లాడుతూ..ఒకరోజు శంకర్ సర్ నాకు ఫోన్ చేసి, 'ఒక సినిమా ఉంది, అందులో పనిచేస్తావా?' అని అడిగారు. నేను సరేనని చెప్పాను, ఆయన 'సరే' అన్నారు. నేను అక్కడికి వెళ్లేసరికి చాలా మంది ప్రముఖులు వచ్చారు. ఎ.ఆర్. రెహమాన్ సర్, రజనీకాంత్ సర్ వచ్చారు. అప్పుడు నేను శంకర్ గారిని చూసి, 'ఇది కచ్చితంగా చాలా పెద్ద సినిమా అయి ఉ ంటుంది' అనుకున్నాను, ఎందుకంటే అక్కడ అంత పెద్ద వాళ్ళంతా గుమిగూడారు. అప్పుడు ఆయన నన్ను చూసి, 'మీ కో-స్టార్ రజనీకాంత్ సర్‌ని కలవండి' అని చెప్పారు.

## శర్వానంద్-శ్రీను వైట్ల కాంబో..
# టార్గెట్ సంక్రాంతి




టాలీవుడ్‌లో ఒక ఆసక్తికరమైన కాంబినేషన్ పట్టాలెక్కబోతోంది. చార్మింగ్ స్టార్ శర్వానంద్ హీరోగా, ఎంటర్‌టైన్‌మెంట్ చిత్రాల దర్శకుడు శ్రీను వైట్ల దర్శకత్వంలో ఒక కొత్త సినిమా లాంఛనంగా ప్రారంభం కానుంది. ప్రముఖ నిర్మాణ సంస్థ ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై డైనమిక్ ప్రొడ్యూసర్ అనిల్ సుంకర ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పూజా కార్యక్రమాలు శుక్రవారం (ఆగస్టు 14) ఉదయం 9:45 గంటలకు జరగనున్నాయి. ఈ మేరకు చిత్ర బృందం ఒక అధికారిక పోస్టర్‌ను విడుదల చేసి ఈ విషయాన్ని ప్రకటించింది. ప్రస్తుతం ఈ చిత్రానికి వర్కింగ్ టైటిల్‌గా ఎస్ఎస్ఎస్1 అని నామకరణం చేశారు. ఈ టైటిల్‌కు శర్వా, శ్రీను, సుంకర అనే ముగ్గురి పేర్లలోని మొదటి అక్షరాలను సూచికగా చూపడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. పోస్టర్‌పై "సైన్స్, సెన్స్, సక్సెస్" అనే ట్యాగ్‌లైన్‌ను కూడా జోడించారు. దీంతో శ్రీను వైట్ల తన మార్క్ కామెడీకి సైన్స్ అంశాలను కూడా జోడించి ఒక కొత్త తరహా కథతో వస్తున్నారా అనే చర్చ మొదలైంది. చాలా కాలంగా సరైన విజయం కోసం ఎదురుచూస్తున్న శ్రీను వైట్ల, ఈ సినిమాతో గ్రాండ్‌గా కమ్‌బ్యాక్ ఇవ్వాలని పట్టుదలతో ఉన్నారు. మరోవైపు, విభిన్నమైన కథలను ఎంచుకునే శర్వానంద్ ఈ ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం సినిమాపై అంచనాలను పెంచుతోంది.

## తారక్ లేకున్నా 'డ్రాగన్' షూటింగ్



టాలీవుడ్ అగ్ర కథనాయకుడు యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'డ్రాగన్' షూటింగ్‌కు సంబంధించి ఒక లేటెస్ట్ అప్‌డేట్ వచ్చేసింది. ఇటీవలే ఎన్టీఆర్ సర్జరీ విజయవంతంగా పూర్తి కావడంతో, ఈ సినిమా షూటింగ్ సెప్టెంబర్ 3 నుంచి తిరిగి ప్రారంభం కానున్నట్లు తెలుస్తుంది. కాగా దీనిపై చిత్రయూనిట్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. భుజానికి జరిగిన సర్జరీ అనంతరం ఎన్టీఆర్ ప్రస్తుతం రెస్ట్ తీసుకుంటున్నప్పటికీ, సినిమా షూటింగ్‌లో ఎలాంటి బ్రేక్ ఉండకూడదని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇందులో భాగంగా సెప్టెంబర్ 3 నుంచి మొదలయ్యే షెడ్యూల్‌లో టాకీ పార్ట్ తో పాటు చిన్ననాటి సన్నివేశాలను డైరెక్టర్ ప్రశాంత్ నీల్ తెరకెక్కించబోతున్నారు.

## గిరిజన అమ్మాయిగా జాన్వీ



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రస్తుతం తన తదుపరి సినిమాతో బిజీగా ఉన్నారు. 'జవాన్' ఫేమ్ అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. సన్ పిక్చర్స్ సంస్థ ఈ చిత్రాన్ని అత్యంత భారీ స్థాయిలో నిర్మిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. అల్లు అర్జున్ కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్‌లలో ఒకటిగా భావిస్తున్న ఈ సినిమాకు సంబంధించి కథ, పాత్రలు, కాస్టింగ్ విషయంలో ఎప్పటికప్పుడు ఆసక్తికరమైన వార్తలు బయటకు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ పాత్రకు సంబంధించి ఓ కొత్త ప్రచారం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ సినిమాలో జాన్వీ కపూర్ కీలక పాత్రలో కనిపించనున్నారని గత కొంతకాలంగా వార్తలు వస్తున్నాయి. అయితే ఆమె పాత్రకు సంబంధించి ఇప్పటివరకు చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రాలేదు. తాజాగా వస్తున్న కథనాల ప్రకారం.. జాన్వీ కపూర్ ఈ సినిమాలో ఒక ట్రైబల్ క్వీన్ (గిరిజన రాణి) పాత్రలో కనిపించబోతున్నట్లు తెలుస్తోంది. ఆమె పాత్ర కేవలం గ్లామర్ కోసం మాత్రమే కాకుండా కథలో చాలా కీలకంగా ఉంటుందని ప్రచారం జరుగుతోంది.



# నిషేధం ముగిశాక ఐపీఎల్ ఆడుతా: హ్యారీ బ్రూక్

కోట్లు కురిపించే ఐపీఎల్‌కు దూరమైన హ్యారీ బ్రూక్ మనసు మార్చుకునేలా ఉన్నాడు. వేలంలో భారీ ధర పలికినా.. తీరా సీజన్ ఆరంభానికి ముందే వైదొలిగే అలవాటున్న బ్రూక్.. ఈసారి ఆ పొరపాటు చేయకూడదని భావిస్తున్నాడు. ఐపీఎల్‌లో తనపై రెండేళ్ల నిషేధం పూర్తయ్యాక.. మళ్లీ పునరాగమనం చేయడంపై ఆలోచిస్తానని చెప్పాడీ ఇంగ్లండ్ కెప్టెన్. ఇంగ్లండ్ వన్డే, టీ20 కెప్టెన్‌గా రాణిస్తున్న హ్యారీ బ్రూక్ ఐపీఎల్‌లో పునరాగమనం చేయడంపై ఆలోచిస్తున్నాడు. దేశం తరఫున మూడు ఫార్మాట్లలో అదరగొడుతున్న అతడు.. తాజాగా ఐపీఎల్‌పై స్పందించాడు. 'ఐపీఎల్ నిజంగా గొప్ప టోర్నమెంట్. అందులో ఆడడం నిజయంగా మర్చిపోలేని అనుభవం. ఐపీఎల్ ఆడితే మనలోని ఉత్తమ బ్యాటర్ బయటకొస్తాడు. ఐపీఎల్ నిజంగా మంచి పోటీనిచ్చే టోర్నీ. ఈ మెగా ఈవెంట్‌లో మళ్లీ ఆడడంపై ఆలోచిస్తా' అని బ్రూక్ వెల్లడించాడు.

# నాకు ప్రైవసీ కావాలి:

## లెస్బియన్ మొగుడు

ఆటతో పాటు వ్యక్తిగత జీవితంలో వివాదాలతోనూ ఇటీవల వార్తల్లో నిలుస్తోంది అష్లే గార్డ్‌నర్. ఏడాదికే వివాహ బంధం ముగియడం, గార్డ్‌నర్ తనను చీట్ చేసిందని భార్య ఆరోపించడంతో మీడియాలో ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ పేరు మార్మోగింది. ఈ నేపథ్యంలో గార్డ్‌నర్ తొలిసారి స్పందించింది. తాను కష్టమైన దశలో ఉన్నానని, తనకు ప్రైవసీ కావాలని ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో అభ్యర్థించిందీ క్రికెటర్. ఇటీవల మహిళల టీ20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా విజయంలో కీలకమైన అష్లీ గార్డ్‌నర్ వ్యక్తిగత జీవితం మాత్రం వివాదాస్పదమైంది. నిరుడు భారత్ ఆతిథ్యమిచ్చిన వన్డే ప్రపంచకప్‌లో గార్డ్‌నర్ తనను చీట్ చేసిందని, మరో క్రికెటర్‌తో సన్నిహితంగా మెలిగిందని ఆమె భార్య మోనికా రైట్ ఆరోపించడమే అందుకు కారణం. వివాహ బంధం అర్థాంతరంగా ముగియడం పట్ల తనపై



మీడియాలో వస్తున్న కథనాలపై గార్డ్‌నర్ స్పందించింది. 'నా భార్యతో విడిపోవడం అనేది వ్యక్తిగత విషయం. క్రికెట్ ఆస్ట్రేలియా నన్ను వైస్ కెప్టెన్ చేసినందున నా రిలేషన్‌షిప్ గురించి బహిరంగంగా చెప్పాల్సిన అవసరముంది. నాఉక మద్దతుగా నిలిచి, బాధ్యతలు అప్పగించిన ఆసీస్ బోర్డుకు ధన్యవాదాలు. వచ్చే సీజన్లలో నేను గొప్ప ప్రదర్శన చేసి జట్టు విజయాల్లో కీలకం అవ్వాలనుకుంటున్నా. మోనిక, నేను కలిసి గడిపిన సమయానికి కృతజ్ఞురాలిని. కానీ, అదే బంధం చివరకు ఎంతో బాధకు కారణమైంది. ఈ పరిస్థితుల్లోనే తను సంతోషంగా ఉండాలని, విజయవంతం అవ్వాలని కోరుకుంటున్నా. ఈ అంశంపై నేను భవిష్యత్‌లో బహిరంగంగా కామెంట్లు చేయను. కాబట్టి.. నాకు ప్రైవసీ కావాలని మీ అందరికి తెలియజేస్తున్నా' అని గార్డ్‌నర్ వెల్లడించింది.

# నీరజ్ చోప్రా-గోపీచంద్ దోస్తీ

యువ క్రీడాకారులను సానబెట్టేందుకు ఇద్దరు దిగ్గజాలు చేతులు కలిపారు. జావెలిన్ స్టార్ నీరచ్ చోప్రా, బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపిచంద్ కొత్తగా కోచింగ్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ కోచింగ్ ఎక్సలెన్స్‌ను గురువారం చోప్రా, గోపిచంద్‌లు ఆవిష్కరించారు. భారత క్రీడా వ్యవస్థను పటిష్టం చేయడమే తమ ఉద్దేశమంటున్నారీ స్పోర్ట్స్ స్టార్స్. నూట నలభై కోట్లకుపైగా జనాభా ఉన్నా.. ఇప్పటికీ ఒలింపిక్స్ పతకాలను వేళ్లమీద లెక్కించాల్సిన పరిస్థితి మనదేశానిది. ప్రతిభావతులున్నా.. అవకాశాలు రాక కొందరు, సరైన మార్గనిర్దేశం లేక మరొకొందరు ఆటల్లో రాణించలేకపోతున్నారు. ఈ పరిస్థితిని చక్కదిద్ది.. క్రీడా భారత్‌ను సాకారం చేయాలనే లక్ష్యంతో మందుకొచ్చారు పుల్లెల గోపిచంద్, నీరజ్ చోప్రాలు. ఇండియన్ స్కూల్ ఆఫ్ కోచింగ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించిన వీరు.. క్రీడా వ్యవస్థను పటిష్టం చేయాలనుకుంటున్నారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ కోచింగ్ ఎక్సలెన్స్‌లో పలు అంశాలు ప్రాధాన్యమివ్వనున్నారు. కోచ్‌లకు పలు కార్యక్రమాలు, శారీరకంగా సిద్ధంగా ఉండడం, స్పోర్ట్స్ సైన్స్, స్పోర్ట్స్ ఎడ్యుకేషన్, సాంకేతికత, కెరీర్ డెవలప్‌మెంట్.. వంటివి చేపట్టనున్నారు.



# నిప్పులు చెరిగిన హసన్

## 198కే ఆస్ట్రేలియా ఆలౌట్

వరల్డ్ నంబర్ 1 ఆస్ట్రేలియాకు బంగ్లాదేశ్ పేసర్ హసన్ మహమూద్(6-55) వణుకు పుట్టించాడు. 23 ఏళ్ల తర్వాత ఆసీస్ గడ్డపై టెస్టు మ్యాచ్ ఆడుతున్న బంగ్లాకు భరోసానిస్తూ.. ఈ స్పీడ్‌స్టర్ వికెట్ల వేటతో ఆసీస్‌ను పడగొట్టాడు. స్టీవ్ స్మిత్(71) ఒంటరి పోరాటం చేసినా.. మహమూద్ అత్యుత్తమ గణాంకాలు నమోదు చేయడంతో కంగారూ టీమ్ కోలుకోలేకపోయింది. తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లా ఇంకా వెనకబడి ఉంది. ప్రపంచ నంబర్ 1 టెస్టు టీమ్ ఆస్ట్రేలియా తడబడింది. సొంతగడ్డపై చెలరేగే ఆసీస్ బ్యాటర్లు బంగ్లాదేశ్ పేస్ దళానికి దాసోహమయ్యారు. డార్విన్ స్టేడియంలో హసన్ మహమూద్(6-55) ఆరు వికెట్లతో రెచ్చిపోగా ఆతిథ్య జట్టు ఇన్నింగ్స్ నత్తనడకలా సాగింది. సహచరులు ఇలా వచ్చి అలా వెళ్లగా.. స్టీవ్ స్మిత్(71) క్రీజునంటుకున్నాడు. కానీ, స్కోర్ మాత్రం రెండొందలు దాటించలేకపోయాడు. తస్కిన్(2-55), హసేన్(2-39)లు సైతం విజృంభించగా కంగారూ టీమ్ 198 పరుగులకేకుప్పకూలింది. ఆస్ట్రేలియాను స్వల్ప స్కోర్‌కే పరిమితం చేసిన బంగ్లాదేశ్ బౌలర్ల నమ్మకాన్ని బ్యాటర్లు నిలబెట్టారు. పటిష్టమైన కంగారూ బౌలింగ్ దళాన్ని ఎదుర్కొన్న ఓపెనర్లు శుభారంభమిచ్చారు. షద్మాన్ ఇస్లాం(20)ను మిచెల్ స్టార్క్ ఔట్ చేసి ఆసీస్‌కు తొలి వికెట్ అందించాడు. అనంతరం మొమినుల్ హక్(35 నాటౌట్), తంజిద్ హసన్ తమీమ్(32 నాటౌట్)లు ఆచితూచి ఆడారు. ఫలితంగా మొదటి రోజు ఆట ముగిసే సరికి బంగ్లాదేశ్ వికెట్ నష్టానికి 96 పరుగులు చేసింది. ఇంకా తొలి ఇన్నింగ్స్‌లో పర్యాటక జట్టు 102 పరుగులు వెనకబడి ఉంది.





# మిచెల్ స్టార్క్ ప్రపంచ రికార్డు

**టెస్టుల్లో అత్యధిక వికెట్లు తీసిన లెఫ్ట్ ఆర్మ్ బౌలర్**



ఆస్ట్రేలియా వెటరన్ ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ టెస్ట్ క్రికెట్‌లో సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో అత్యధిక వికెట్లు పడగొట్టిన ఎడమచేతి వాటం బౌలర్‌గా చరిత్రకెక్కాడు. ఈ క్రమంలో శ్రీలంక దిగ్గజ స్పిన్నర్ రంగనా హెరాత్ (433) రికార్డును అధిగమించాడు. బంగ్లాదేశ్‌తో డార్విన్‌లోని మరారా క్రికెట్ గ్రౌండ్‌లో జరుగుతున్న తొలి టెస్టులో ఈ అరుదైన ఘనతను అందుకున్నాడు. ఈ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ ఓపెనర్ షాద్మాన్ ఇస్లామ్‌ను ఔట్ చేయడం ద్వారా స్టార్క్ తన టెస్టు వికెట్ల సంఖ్యను 434కి పెంచుకున్నాడు. తన 106వ టెస్టులో ఈ మైలురాయిని చేరుకున్న స్టార్క్, భారత క్రికెట్ దిగ్గజం కపిల్ దేవ్ (434 వికెట్లు) రికార్డును సమం చేశాడు. ప్రస్తుతం టెస్టుల్లో ఆల్-టైమ్ వికెట్ టేకర్ల జాబితాలో 10వ స్థానంలో ఉన్న దక్షిణాఫ్రికా పేస్ దిగ్గజం డేల్ స్టెయిన్ (439) రికార్డును బద్దలు కొట్టడానికి స్టార్క్ కేవలం ఆరు వికెట్ల దూరంలో ఉన్నాడు. ఈ రికార్డుతో ఎడమచేతి వాటం బౌలర్ల జాబితాలో స్టార్క్ అగ్రస్థానాన్ని పదిలం చేసుకున్నాడు. రంగనా హెరాత్ (433), పాకిస్థాన్ గ్రేట్ వసీం అక్రమ్ (414), న్యూజిలాండ్ స్పిన్నర్ డానియల్ వెటోరి (362), శ్రీలంక పేసర్ చమిందా వాస్ (355) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. భారత ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా 348 వికెట్లతో ఈ జాబితాలో ఆరో స్థానంలో కొనసాగుతున్నాడు. అయితే, వ్యక్తిగత రికార్డులపై తాను పెద్దగా దృష్టి పెట్టనని, జట్టు ప్రయోజనాలే ముఖ్యమని ఈ సిరీస్‌కు ముందు స్టార్క్ పేర్కొన్నాడు. ఐసీసీ కథనం ప్రకారం.. "ఇలాంటి దిగ్గజాల సరసన నా పేరు వినిపించడం గౌరవంగా ఉంది. కానీ, ఆడుతున్నప్పుడు ఈ గణాంకాలకు పెద్దగా ప్రాధాన్యం ఉండదు" అని స్టార్క్ తెలిపాడు. కాగా, స్టార్క్ ఈ చారిత్రక ఘనత సాధించిన రోజే ఆస్ట్రేలియా జట్టు బ్యాటింగ్‌లో ఘోరంగా విఫలమైంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న ఆసీస్, బంగ్లాదేశ్ బౌలర్ల ధాటికి కేవలం 198 పరుగులకే కుప్పకూలింది. బంగ్లా బౌలర్ హసన్ మహమూద్ 55 పరుగులిచ్చి 6 వికెట్లతో కెరీర్ బెస్ట్ ప్రదర్శన చేశాడు. ఆసీస్ తరఫున స్టీవ్ స్మిత్ (71) ఒక్కడే పోరాడాడు.

# సీఎస్కే కోచ్‌గా ధోనీయే కరెక్ట్: అశ్విన్

ఐపీఎల్ 2026 సీజన్‌లో నిరాశాజనక ప్రదర్శన తర్వాత చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) జట్టు హెడ్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్‌తో తమ బంధాన్ని ముగించుకున్న సంగతి తెలిసిందే. అప్పటి నుంచి సీఎస్‌కే తదుపరి కోచ్ ఎవరనే దానిపై తీవ్రమైన చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో టీమిండియా సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ ఛానెల్‌లో ఆసక్తికర విశ్లేషణ చేశాడు. ఇంగ్లండ్‌కు వన్డే ప్రపంచకప్ అందించిన మాజీ కెప్టెన్ ఇయాన్ మోర్గాన్, సీఎస్‌కే కొత్త హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టే అవకాశాలున్నాయని జోస్యం చెప్పాడు. మోర్గాన్‌కు ఉన్నత స్థాయిలో కోచింగ్ అనుభవం లేనప్పటికీ, అతను ఈ పదవికి బలమైన పోటీదారుడని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. "నాకు ఎందుకో ఇయాన్ మోర్గాన్ వస్తాడని అనిపిస్తోంది. అతని పేరు బలంగా వినిపిస్తోంది. ఇప్పటికే తొలి దశ చర్చలు జరుగుతున్నాయనడంలో సందేహం లేదు. అయితే, మోర్గాన్ ఈ ఏడాదే బాధ్యతలు తీసుకుంటాడా? లేక మినీ వేలంలో మరొకరు జట్టును నిర్మించిన తర్వాత అతడు వస్తాడా? అనేది చూడాలి" అని అశ్విన్ తెలిపాడు. 2019లో ఇంగ్లండ్‌కు ప్రపంచకప్ అందించడం, 2021లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌ను కెప్టెన్‌గా ఫైనల్ చేర్చడం మోర్గాన్‌కు కలిసివచ్చే అంశాలని పేర్కొన్నాడు.

# గంభీర్ కొనసాగింపునకే బీసీసీఐ మొగ్గు

టీమిండియా హెడ్ కోచ్‌గా గౌతమ్ గంభీర్ పదవికి వచ్చిన ముప్పేమీ లేదని, అతడు ప్రస్తుతానికి సురక్షితంగానే ఉన్నారని తెలుస్తోంది. ఇటీవల ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనల్లో జట్టు వైఫల్యాలు, అంతకుముందు స్వదేశంలో టెస్టు సిరీస్‌లలో ఎదురైన పరాజయాలతో గంభీర్‌పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. అయినప్పటికీ బీసీసీఐ గౌతీకి అండగా నిలుస్తున్నట్లు సమాచారం. గంభీర్‌ను కోచ్ పదవి నుంచి తొలగించకపోవడానికి ప్రధానంగా రెండు కారణాలు కనిపిస్తున్నాయి. గతంలో న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా జట్లతో స్వదేశంలో జరిగిన టెస్టు సిరీస్‌లలో టీమిండియా ఘోర పరాజయాలు చవిచూసింది. దీనికి తోడు ఇటీవల పరిమిత ఓవర్ల క్రికెట్‌లోనూ జట్టు ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేదు. ఈ నేపథ్యంలో 2027 వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు అర్హత సాధించడం భారత్‌కు కష్టతరంగా మారింది. దీంతో సోషల్ మీడియాలో గంభీర్‌ను తొలగించాలనే డిమాండ్లు ఊపందుకున్నాయి. అయితే, బోర్డు వర్గాలు మాత్రం భిన్నంగా ఆలోచిస్తున్నట్లు స్పష్టమవుతోంది. టెస్టు జట్టు ప్రస్తుతం ఒక పరివర్తన దశలో ఉందని బీసీసీఐ భావించడమే ఇందుకు మొదటి కారణం.



# వయసు కాదు.. ఆటే మ్యాటర్: హర్భజన్

వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్‌లో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఆడడంపై ఇంకా స్పష్టత లేదు. దిగ్గజాలైన ఇద్దరిని మెగా టోర్నీలో ఆడించాలనే డిమాండ్లు వస్తున్నా సెలెక్టర్లు, బీసీసీఐ మాత్రం ఏదీ తేల్చట్లేదు. అయితే.. పలువురు మాజీ ఆటగాళ్లు విరాట్, రోహిత్ అనుభవం భారత్‌కు కలిసొస్తుందని వాదిస్తున్నారు. తాజాగా మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ సైతం ఈ వెటరన్స్‌కు వరల్డ్‌కప్ స్క్వాడ్‌లో చోటు కల్పించాలని డిమాండ్ చేశాడు. భారత జట్టుకు దశాబ్దాలుగా సేవలందిస్తున్న విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు వన్డే వరల్డ్‌కప్ ఆడాలని భావిస్తున్నారు. వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్న ఈ స్టార్ ద్వయం..మెగా ఈవెట్‌తో వీడ్కోలు పలికే అవకాశాలున్నాయి. అయితే.. వయసు 35 ప్లస్ దాటడంతో వీరిని పక్కనపెట్టి.. కుర్రాళ్లను తీసుకోవాలనే ప్రయత్నాల్లో ఉన్నారు సెలెక్టర్లు. కానీ, అనుభవజ్ఞులైన



ఇద్దరినీ ఆడించాలని మాజీలు అభిప్రాయపడుతుండగా.. పీటీఐ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో హర్భజన్ సింగ్ మాట్లాడుతూ.. వరల్డ్‌కప్ కోసం ఆటగాళ్ల ఎంపికలో నిలకడ కొలమానం కావాలని అన్నాడు. 'ఆటగాళ్ల వయసు ముఖ్యం కాదు. వారు పరుగులు సాధిస్తున్నారా? నిలకడ ఉందా? అనేవి మాత్రమే చూడాలి. వచ్చే ఏడాది వరల్డ్‌కప్ సమయానికి కోహ్లీకి 39 ఏళ్లు, రోహిత్‌కు నలభై వస్తాయి. ఫిట్‌నెస్‌లో రారాజైన విరాట్ ఇప్పటకీ మైదానంలో 20 ఏళ్ల కుర్రాళ్లతో పోటీపడగలడు. లియోనల్ మెస్సీని తీసుకోండి.. అతడికి 39. అయినా.. ఫిఫా వరల్డ్‌కప్‌లో మెరిశాడు. ఫిట్‌గా ఉన్న అతడిని మైదానంలో ఐదుగురు ప్రత్యర్థులు కూడా అడ్డుకోలేరు. వయసు కంటే నైపుణ్యమే పరిగణనలోకి తీసుకోవాలి. ట, ఫిట్‌నెస్‌లో కోహ్లీ, విరాట్ అదరగొడుతున్నప్పుడు.. శ్రేయాస్ అయ్యర్, యశస్వీ జైస్వాల్ అవసరం ఉండదుగా. అలానే.. పదిహేనేళ్ల వైభవ్ సూర్యవంశీ నుంచి ఎక్కువగా ఆశించడం పొరపాటే అవుతుంది. కోహ్లీ, రోహిత్‌కు మూడొందల మ్యాచ్‌ల అనుభవుమంది. కాబట్టి.. వీరిని ఆడించడం టీమిండియాకు మంచిది' అని భజ్జీ పేర్కొన్నాడు.

ఈవార్తలు
ప్రజావాణి
శుక్రవారం 14-8-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు


నేటి ఈవార్తలు

సంపాదకీయం Editorial

# ఏఐకి ప్రపంచ చట్టం అవసరం

కృత్రిమ మేధ.. కొన్నేళ్ల క్రితం వరకు సాంకేతిక నిపుణుల చర్చల్లో మాత్రమే వినిపించిన పదం. ఇప్పుడు మనిషి జీవితంలోని దాదాపు ప్రతి రంగంలోకి ప్రవేశించింది. విద్య నుంచి వైద్యం వరకు, వ్యవసాయం నుంచి రక్షణ రంగం వరకు, బ్యాంకింగ్ నుంచి వినోదం వరకు.. ఏఐ ప్రభావం వేగంగా పెరుగుతోంది. ఒకవైపు అపారమైన అవకాశాలను సృష్టిస్తున్న ఈ సాంకేతికత.. మరోవైపు వ్యక్తిగత గోప్యత, ఉద్యోగ భద్రత, నకిలీ సమాచారం, డీప్‌ఫేక్‌లు, సైబర్ నేరాలు, పక్షపాత నిర్ణయాలు వంటి ప్రమాదాలను కూడా తెస్తోంది. ఇక్కడే ఒక కీలకమైన ప్రశ్న ముందుకొస్తోంది. కృత్రిమ మేధకు ప్రపంచవ్యాప్తంగా అమలయ్యే ఒక సాధారణ చట్టం అవసరమా? ప్రస్తుతం ఏఐ నియంత్రణకు ప్రపంచవ్యాప్తంగా ఒకే విధమైన వ్యవస్థ లేదు. యూరోపియన్ యూనియన్ ప్రమాద స్థాయిని ఆధారంగా చేసుకుని ఏఐ వ్యవస్థలను నియంత్రించే చట్టపరమైన విధానాన్ని తీసుకొచ్చింది. అమెరికా, చైనా, భారత్ సహా ఇతర దేశాలు తమ తమ విధానాలను రూపొందిస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి కూడా ఏఐ పాలనపై అంతర్జాతీయ సహకారాన్ని పెంచే దిశగా ముందుకు సాగుతోంది. కానీ దేశాల మధ్య నియంత్రణ ప్రమాణాలు భిన్నంగా ఉండటం భవిష్యత్తులో పెద్ద సమస్యగా మారే అవకాశం ఉంది. ఒక దేశంలో నిషేధించిన ఏఐ సాధనం మరో దేశంలో స్వేచ్ఛగా అందుబాటులో ఉంటే దాన్ని ఎవరు నియంత్రించాలి? ఒక దేశంలో తయారైన డీప్‌ఫేక్ మరో దేశ ప్రజలను ప్రభావితం చేస్తే బాధ్యత ఎవరిది? ఒక దేశానికి చెందిన సంస్థ మరో దేశ ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని ఏఐ శిక్షణకు ఉపయోగిస్తే ఏ చట్టం వర్తించాలి? సైబర్ దాడులకు ఏఐని ఉపయోగించినప్పుడు నేరస్థుడిని ఏ దేశ న్యాయస్థానంలో విచారించాలి? ఇలాంటి ప్రశ్నలకు దేశీయ చట్టాలు మాత్రమే సరిపోవు. అయితే 'ప్రపంచ చట్టం' పేరుతో ప్రతి దేశంపై ఒకే విధమైన కఠిన నిబంధనలు విధించడం కూడా అంత సులభం కాదు. అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఏఐ ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ఒక గొప్ప అవకాశం. అతిగా నియంత్రిస్తే పరిశోధన, ఆవిష్కరణలు మందగించే ప్రమాదం ఉంది. చిన్న సంస్థలు, స్టార్టప్‌లు భారీ నియంత్రణ వ్యయాలను భరించలేక వెనుకబడవచ్చు. అందుకే నియంత్రణ ఉండాలి.. కానీ ఆవిష్కరణను చంపే నియంత్రణ కాకూడదు. ముఖ్యంగా ఏఐ నిర్ణయాలకు బాధ్యత ఎవరిది అన్నది స్పష్టంగా ఉండాలి. వైద్య ఏఐ తప్పు నిర్ధారణ చేస్తే బాధ్యత ఎవరిది? బ్యాంకు రుణాన్ని ఏఐ తిరస్కరిస్తే ఆ నిర్ణయాన్ని ప్రశ్నించే హక్కు వినియోగదారుడికి ఉండాలా? ఉద్యోగ నియామకంలో ఏఐ పక్షపాతంగా వ్యవహరిస్తే సంస్థపై చర్య ఉండాలా? సమాధానం ఒక్కటే.. మనిషి జీవితాన్ని ప్రభావితం చేసే కీలక నిర్ణయాల్లో జవాబుదారీతనం తప్పనిసరి. అలాగే డీప్‌ఫేక్‌లు, ఎన్నికల అపసమాచారం, పిల్లలపై ప్రభావం చూపే కృత్రిమ కంటెంట్, వ్యక్తిగత సమాచార దుర్వినియోగం వంటి అంశాల్లో అంతర్జాతీయ ప్రమాణాలు అత్యవసరం. ముఖ్యంగా ప్రజాస్వామ్య వ్యవస్థలను ప్రభావితం చేసే ఏఐ దుర్వినియోగంపై దేశాల మధ్య సహకారం లేకపోతే సాంకేతికత ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారవచ్చు. ఇక ఉద్యోగాల అంశం మరింత కీలకం. ఏఐ లక్షలాది ఉద్యోగాల స్వరూపాన్ని మార్చబోతోంది. కొన్ని ఉద్యోగాలు కనుమరుగవుతాయి. మరికొన్ని కొత్త ఉద్యోగాలు పుడతాయి. కానీ మార్పు వేగం ఎక్కువగా ఉంటే నైపుణ్యాలు లేని వర్గాలు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. కాబట్టి ప్రపంచ ఏఐ విధానంలో నైపుణ్యాభివృద్ధి, పునఃశిక్షణ, కార్మికుల రక్షణ కూడా భాగం కావాలి. భారత్‌కు ఈ చర్చ మరింత ప్రాధాన్యమైనది. ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశాల్లో ఒకటైన భారత్‌లో ఏఐ విస్తరణ కోట్లాది ప్రజల జీవితాలను ప్రభావితం చేయగలదు. అదే సమయంలో యువతకు కొత్త అవకాశాలు, పరిశ్రమలకు ఉత్పాదకత, ప్రభుత్వానికి మెరుగైన సేవలు అందించే సామర్థ్యం కూడా ఏఐకి ఉంది. కాబట్టి భారత్ 'పూర్తి నియంత్రణ'కు కాకుండా 'బాధ్యతాయుతమైన ఏఐ'కి నాయకత్వం వహించాలి.



## డాలర్‌కు ప్రత్యామ్నాయం

# సాధ్యమేనా?

ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు దశాబ్దాలుగా డాలరే వెన్నెముక. కానీ మారుతున్న భౌగోళిక రాజకీయాలు, డిజిటల్ కరెన్సీలు, ద్వైపాక్షిక వాణిజ్యం, బ్రిక్స్ దేశాల ప్రయత్నాలు.. డాలర్ ఆధిపత్యానికి సవాలుగా మారుతున్నాయి. అయితే డాలర్‌ను ఒక్కసారిగా భర్తీ చేసే శక్తి మరో కరెన్సీకి ఉందా? ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో డాలర్ స్థానం ప్రత్యేకమైనది. అంతర్జాతీయ వాణిజ్యం, ముడిచమురు లావాదేవీలు, కేంద్ర బ్యాంకుల విదేశీ మారక నిల్వలు, అంతర్జాతీయ రుణాలు.. ఇలా అనేక రంగాల్లో అమెరికా డాలర్ కీలక పాత్ర పోషిస్తోంది. అమెరికా ఆర్థిక వ్యవస్థ పరిమాణం మాత్రమే ఇందుకు కారణం కాదు. ప్రపంచవ్యాప్తంగా డాలర్‌పై ఉన్న నమ్మకం, అమెరికా ఆర్థిక మార్కెట్ల లోతు, డాలర్ ఆధారిత చెల్లింపుల మౌలిక వ్యవస్థ, అమెరికా ప్రభుత్వ బాండ్లకు ఉన్న భారీ మార్కెట్ కూడా దాని ఆధిపత్యాన్ని బలపరుస్తున్నాయి. అయితే ఇప్పుడు పరిస్థితులు మారుతున్నాయి. అమెరికా ఆంక్షలను ఎదుర్కొంటున్న దేశాలు డాలర్ ఆధారిత వ్యవస్థకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నాయి. చైనా, రష్యా, భారత్ సహా పలు దేశాలు ద్వైపాక్షిక వాణిజ్యంలో తమ తమ కరెన్సీల వినియోగాన్ని పెంచే ప్రయత్నాలు చేస్తున్నాయి. బ్రిక్స్ దేశాల్లోనూ డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించాలన్న చర్చ కొనసాగుతోంది.

ఇక్కడ ఒక విషయం స్పష్టంగా గుర్తించాలి. డాలర్ ఆధిపత్యాన్ని తగ్గించడం వేరు.. డాలర్‌ను పూర్తిగా భర్తీ చేయడం వేరు. ప్రస్తుతం ప్రపంచానికి డాలర్‌కు సమానమైన ప్రత్యామ్నాయం కనిపించడం లేదు. యూరోకు బలమైన ఆర్థిక వ్యవస్థ ఉన్నప్పటికీ యూరోపియన్ యూనియన్‌లోని రాజకీయ, ఆర్థిక విభిన్నతలు దానికి పరిమితులు కల్పిస్తున్నాయి. చైనా యువాన్ అంతర్జాతీయ ప్రాధాన్యం పెంచుకుంటున్నప్పటికీ, చైనా మూలధన ఖాతాపై ఉన్న నియంత్రణలు, ఆర్థిక పారదర్శకతపై ప్రశ్నలు దాని విస్తరణకు అడ్డంకులుగా ఉన్నాయి. మరోవైపు బిట్‌కాయిన్ వంటి క్రిప్టో కరెన్సీలు ప్రభుత్వ నియంత్రణకు ప్రత్యామ్నాయంగా ప్రచారం పొందుతున్నా, వాటి ధరల్లో తీవ్ర ఒడిదుడుకులు ఉండటం, విస్తృత స్థాయి అంతర్జాతీయ వాణిజ్యానికి అవసరమైన స్థిరత్వం లేకపోవడం ప్రధాన సమస్యలు. కేంద్ర బ్యాంకుల డిజిటల్ కరెన్సీలు భవిష్యత్తులో అంతర్జాతీయ చెల్లింపులను మార్చగలిగినా.. అవి కూడా ఇప్పటికీ అభివృద్ధి దశలోనే ఉన్నాయి. అందువల్ల భవిష్యత్తు బహుశా 'డాలర్ లేని ప్రపంచం' కాకుండా 'బహుళ కరెన్సీల ప్రపంచం' కావచ్చు. ఒక దేశం నుంచి మరొక దేశానికి వాణిజ్యం జరుగుతున్నప్పుడు ప్రతి లావాదేవీ డాలర్ ద్వారానే జరగాల్సిన అవసరం తగ్గవచ్చు. భారత్-రష్యా, భారత్-ఇరాన్, చైనా-రష్యా వంటి దేశాల మధ్య స్థానిక కరెన్సీల్లో వాణిజ్యాన్ని పెంచే ప్రయత్నాలు ఈ మార్పుకు సంకేతాలు. భవిష్యత్తులో డిజిటల్ చెల్లింపు వ్యవస్థలు, తక్షణ అంతర్జాతీయ లావాదేవీలు, కేంద్ర బ్యాంకుల డిజిటల్ కరెన్సీలు ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేసే అవకాశం ఉంది. భారత్‌కు ఇందులో పెద్ద అవకాశం ఉంది. రూపాయిని అంతర్జాతీయ వాణిజ్యంలో మరింత విస్తృతంగా ఉపయోగించాలంటే ముందుగా భారత ఆర్థిక వ్యవస్థ మరింత బలపడాలి. ఎగుమతులు పెరగాలి. స్థిరమైన ద్రవ్య విధానం ఉండాలి. బలమైన ఆర్థిక మార్కెట్లు, లోతైన బాండ్ మార్కెట్, పెట్టుబడిదారులకు విశ్వాసం, చెల్లింపుల సాంకేతిక మౌలిక వసతులు అభివృద్ధి చెందాలి.

కేవలం 'డాలర్‌కు ప్రత్యామ్నాయం కావాలి' అని రాజకీయంగా ప్రకటించడం ద్వారా రూపాయి అంతర్జాతీయ కరెన్సీగా మారదు. ప్రపంచం రూపాయిని స్వీకరించాలంటే ముందుగా ప్రపంచం భారత ఆర్థిక వ్యవస్థపై నమ్మకం పెట్టుకోవాలి. అదే సమయంలో డాలర్ ఆధిపత్యం అమెరికాకు అపారమైన ప్రయోజనాలను ఇస్తున్నప్పటికీ, దానిపై అధిక ఆధారపడటం ఇతర దేశాలకు కూడా ప్రమాదమే. అమెరికా వడ్డీ రేట్ల మార్పులు, డాలర్ బలపడటం, అంతర్జాతీయ ఆర్థిక ఆంక్షలు.. ఇవన్నీ అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థిక వ్యవస్థలపై ప్రభావం చూపుతాయి. దిగుమతి ఖర్చులు, విదేశీ రుణ భారం, చమురు ధరలు, ద్రవ్యోల్బణం వంటి అంశాలపై కూడా ప్రభావం పడుతుంది. అందుకే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సమతుల్యత అవసరం. అయితే ఆ సమతుల్యత డాలర్‌ను బలవంతంగా తొలగించడం ద్వారా కాకుండా, ప్రత్యామ్నాయ వ్యవస్థలను బలపరచడం ద్వారా రావాలి. ప్రపంచ వాణిజ్యం స్థానిక కరెన్సీల్లో కొంత భాగం, డాలర్‌లో కొంత భాగం, యూరో--యువాన్ వంటి ఇతర ప్రధాన కరెన్సీల్లో కొంత భాగం జరిగే వ్యవస్థ భవిష్యత్తులో సాధ్యమే. అంటే ఒకే కరెన్సీ ఆధిపత్యం క్రమంగా తగ్గి బహుళ కరెన్సీల ఆధారిత ఆర్థిక వ్యవస్థ ఏర్పడే అవకాశం ఉంది. అయితే దీనికి మరో ప్రమాదం ఉంది. డాలర్ స్థానంలో మరో ఒక్క దేశ కరెన్సీ ఆధిపత్యం ఏర్పడితే సమస్య పరిష్కారం కాదు. ఒక ఆధిపత్యానికి బదులుగా మరో ఆధిపత్యం రావడం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు నిజమైన ప్రత్యామ్నాయం కాదు.



- రణధీర్ గుండు

ప్రపంచానికి అవసరమైంది పోటీ, పారదర్శకత, స్థిరత్వం, పరస్పర నమ్మకంతో కూడిన బహుళ కరెన్సీ వ్యవస్థ. డాలర్ రేపటితో అంతరించిపోదు. దాని స్థానాన్ని మరో కరెన్సీ కూడా ఒక్కసారిగా ఆక్రమించలేదు. కానీ అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ నెమ్మదిగా మారుతోంది. ఈ మార్పులో ఎవరు ముందుగా సిద్ధమవుతారో వారే భవిష్యత్తు ఆర్థిక శక్తులుగా ఎదుగుతారు. డాలర్ ఆధిపత్యానికి ప్రత్యామ్నాయం సాధ్యమే. కానీ అది మరో 'ప్రపంచ కరెన్సీ' రూపంలో కాకుండా.. అనేక బలమైన కరెన్సీలు, ప్రత్యామ్నాయ చెల్లింపు వ్యవస్థలు, డిజిటల్ ఆర్థిక మౌలిక వసతులతో కూడిన బహుళ ధ్రువ ప్రపంచంగా రూపుదిద్దుకునే అవకాశమే ఎక్కువ. భారత్‌కు ఇప్పుడు చేయాల్సింది డాలర్‌తో యుద్ధం చేయడం కాదు. రూపాయిపై ప్రపంచానికి నమ్మకం కలిగించేంత బలమైన ఆర్థిక వ్యవస్థను నిర్మించడం. అదే డాలర్ ఆధిపత్యానికి నిజమైన ప్రత్యామ్నాయం.

## యువతను గెలవాలి..

# ఓట్లను కాదు!



**రాజకీయాలకు ప్రజా సమస్యలే కేంద్రబిందువులు కావాలి..**

**పార్లమెంట్‌లో గందరగోళం కాదు.. పరిష్కారాలపై చర్చ అవసరం..**

**ఉద్యోగం, విద్య, భవిష్యత్తుపై యువత ప్రశ్నలకు సమాధానం చెప్పాలి..**

దేశ రాజకీయాల్లో మరోసారి ఒక కీలకమైన ప్రశ్న ముందుకొచ్చింది. రాజకీయ పార్టీలు ప్రజలను గెలుచుకోవాలనుకుంటున్నాయా? లేక కేవలం ఎన్నికల్లో ఓట్లను గెలుచుకోవాలనుకుంటున్నాయా? ఈ రెండింటి మధ్య తేడా చాలా పెద్దది. ఎన్నికల సమయంలో ప్రజల సమస్యలు రాజకీయ పార్టీలకు గుర్తుకొస్తాయి. కానీ ఎన్నికలు ముగిసిన తర్వాత అదే సమస్యలు రాజకీయ నినాదాలుగా, ఆరోపణలుగా, ప్రత్యారోపణలుగా మారిపోతున్నాయి. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈ పరిస్థితికి మరో ఉదాహరణగా నిలిచాయి. అధికార పక్షం-ప్రతిపక్షం మధ్య తీవ్ర విభేదాలు, నిరసనలు, సభా కార్యకలాపాలకు అంతరాయాలతో కీలక అంశాలపై సమగ్ర చర్చకు అవకాశం తగ్గిపోయింది. ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీకి పంపించడం వంటి పరిణామాలు మాత్రం చర్చకు, పరిశీలనకు ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్న ప్రాధాన్యాన్ని గుర్తుచేశాయి. అయితే దేశ యువత అడుగుతున్న ప్రశ్నలు అంతకంటే పెద్దవి.

**ఉద్యోగం ఎక్కడ?**

**నాణ్యమైన విద్య ఎక్కడ?**

**పరీక్షల్లో పారదర్శకత ఎక్కడ?**

**ప్రతిభకు తగిన అవకాశాలు ఎక్కడ?**

ఇటీవలి కాలంలో పోటీ పరీక్షలు, ఉద్యోగ నియామకాలపై యువతలో పెరుగుతున్న అసంతృప్తి దీనికి నిదర్శనం. ఉద్యోగాల కోసం సంవత్సరాల తరబడి సిద్ధమవుతున్న యువతకు పరీక్షల నిర్వహణలో అవకతవకలు, ప్రశ్నపత్రాల లీకేజీలు, నియామకాల ఆలస్యం వంటి అంశాలు కేవలం పరిపాలనా లోపాలు కావు. అవి వారి జీవితాలతో ముడిపడిన సమస్యలు.



- శ్రీకాంత్ చుక్కల,
నిజామాబాద్

ఇటీవల జార్ఖండ్‌లో ఉద్యోగ నియామకాలపై యువత ఆందోళన ఉద్రిక్తంగా మారడం కూడా ఈ అసంతృప్తికి ఒక ప్రతిబింబమే. ఇలాంటి సమయంలో రాజకీయ పార్టీలు యువత సమస్యలను తమ రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడం కాకుండా, వాటికి శాశ్వత పరిష్కారాలు చూపించాలి. యువతకు సోషల్ మీడియాలో సందేశాలు పంపడం సులభమే. సభల్లో వారి పేర్లు ప్రస్తావించడం కూడా సులభమే. కానీ వారికి లక్షలాది ఉద్యోగాలు కల్పించే ఆర్థిక విధానాలను రూపొందించడం, నియామక వ్యవస్థను పారదర్శకంగా మార్చడం, విద్యా ప్రమాణాలను పెంచడం మాత్రం కష్టమైన పని. అదే నిజమైన రాజకీయ పరీక్ష. దేశంలో రాజకీయ చర్చలు వ్యక్తుల చుట్టూ తిరగడం ప్రమాదకరం. ఎవరు ఎవరిని విమర్శించారు? ఎవరు ఎవరిపై ఆరోపణలు చేశారు? ఎవరు ఏ పార్టీలోకి వెళ్లారు? ఎవరి నాయకత్వం బలంగా ఉంది? వంటి అంశాలు రోజువారీ రాజకీయ చర్చలో భాగమే కావచ్చు. కానీ సామాన్యుడి జీవితాన్ని మార్చే అంశాలు అవి కావు.

**రైతుకు పంటకు గిట్టుబాటు ధర కావాలి.**

**యువతకు ఉద్యోగం కావాలి.**

**విద్యార్థికి నాణ్యమైన విద్య కావాలి.**

**మధ్యతరగతికి ధరల భారం తగ్గాలి.**

**చిన్న వ్యాపారికి భరోసా కావాలి.**

**ఉద్యోగికి సామాజిక భద్రత కావాలి.**

**ఈ అంశాలపై రాజకీయ పార్టీలు పోటీ పడాలి.**

తెలంగాణకూ ఇదే వర్తిస్తుంది. తెలంగాణ రాజకీయాల్లోనూ కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. అధికార కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ విమర్శలు, ప్రభుత్వంపై బీజేపీ ఆరోపణలు, ప్రతిపక్షాలపై అధికార పక్షం ఎదురుదాడులు నిత్యకృత్యంగా మారాయి. ఇటీవల బీజేపీ నేతలు కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై అవినీతి ఆరోపణలు చేస్తూ దర్యాప్తు కోరారు. మరోవైపు బీఆర్ఎస్ కూడా ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తోంది. కానీ తెలంగాణ ప్రజలు రాజకీయ పార్టీల నుంచి కేవలం ఆరోపణలు వినాలనుకోవడం లేదు. రైతు తన పంటకు నీరు, ధర కోరుతున్నాడు. నిరుద్యోగి ఉద్యోగ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నాడు. పట్టణ ప్రజలు రవాణా, తాగునీరు, కాలుష్యం, మౌలిక వసతులపై ఆందోళన చెందుతున్నారు. పేద కుటుంబాలు సంక్షేమ పథకాల అమలును గమనిస్తున్నాయి. ఇవే రాజకీయాల అసలు కొలమానాలు. రాజకీయ పార్టీలు ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. ప్రజలు నాయకుల ప్రసంగాలను కొంతకాలం గుర్తుంచుకోవచ్చు. కానీ తమ జీవితాల్లో వచ్చిన మార్పును మాత్రం ఎక్కువకాలం గుర్తుంచుకుంటారు. అందుకే వచ్చే ఎన్నికల కోసం యువతను ఆకర్షించేందుకు కొత్త నినాదాలు వెతకడం కంటే, వారి భవిష్యత్తుకు బలమైన విధానాలు రూపొందించాలి. యువతను ఓటు బ్యాంకుగా చూడటం మానేసి, దేశ నిర్మాణంలో భాగస్వాములుగా చూడాలి. పార్లమెంట్ ప్రజల సమస్యలను చర్చించే వేదిక. అసెంబ్లీలు కూడా అదే బాధ్యతను నిర్వర్తించాలి. సభలు స్తంభిస్తే రాజకీయ నాయకుల సమయం మాత్రమే వృథా కాదు.. ప్రజాస్వామ్యానికి ప్రజలు పెట్టిన నమ్మకం కూడా దెబ్బతింటుంది.

**విమర్శ ఉండాలి.. కానీ ప్రత్యామ్నాయం కూడా ఉండాలి.**

**పోరాటం ఉండాలి.. కానీ పరిష్కారం కూడా చూపాలి.**

**రాజకీయ పోటీ ఉండాలి..**

**కానీ ప్రజా ప్రయోజనం ముందుండాలి.**

దేశ యువత రాజకీయ నాయకుల మాటలను మాత్రమే కాదు.. వారి పనితీరును కూడా గమనిస్తోంది. సోషల్ మీడియా కాలంలో రాజకీయ ప్రచారంతో ప్రజాభిప్రాయాన్ని కొంతకాలం ప్రభావితం చేయవచ్చు. కానీ ఉద్యోగం కోసం తిరిగే యువకుడి అనుభవాన్ని, రైతు పొలంలో ఎదుర్కొనే సమస్యను, సామాన్యుడి కుటుంబ బడ్జెట్‌ను మాత్రం ప్రచారంతో మార్చలేరు.

రాజకీయాలకు ఇక కొత్త దిశ అవసరం.

ప్రజలను విభజించే రాజకీయాలు కాదు.. ప్రజల సమస్యలను పరిష్కరించే రాజకీయాలు కావాలి.

యువతను ఆకర్షించే రాజకీయాలు కాదు.. యువత భవిష్యత్తును నిర్మించే రాజకీయాలు కావాలి.

అదే ప్రజాస్వామ్యానికి నిజమైన విజయం.

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004